Follow: @ANNTELUGU

08-03-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 96 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## మహిళలకు పీసీసీ చీఫ్ శుభాకాంక్షలు



- రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యం
- మహిళా సాధికారితకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట- మహేష్ కుమార్ గౌడ్

02

## 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- కరీంనగర్ సీపీగా గౌస్ ఆలం
- వరంగల్ సీపీగా సన్ ప్రీత్ సింగ్

02

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త



- 2.5 శాతం డీఏ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం
- ఎక్స్ వేదికగా వెల్లడించిన మంత్రి పొన్నం

02


భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా మహిళలు పలు రంగాల్లో రాణిస్తున్నారు. తమ ప్రతిభా పాటవాలను కనబరుస్తున్నారు. నింగీ నేలా మాదేనంటు ఆకాశంలో కూడా గెలుపు సంతకాలు చేస్తున్నారు. సంప్రదాయాల సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛావాయువులు పీలుస్తూ..ప్రతిభతో ఎదుగుతున్నారు. ఆడవారంటూ బలహీనులు కాదు బలవంతులని నిరూపిస్తున్నారు. బిలియన్ డాలర్ల కంపెనీలల్లో కీలకంగా వ్యవహరిస్తు సీవోల స్థాయిల్లో కంపెనీలను విజయతీరాలవైపు నడిపిస్తున్నారు. స్టార్టప్ లతో మొదలై కోట్ల టర్నోవర్లకు చేరుకుంటూ అటు కుటుంబాలను ఇటు వ్యాపారాలను సమర్థవంతంగా నడిపిస్తున్నా మహిళలు ఎంతోమంది ఉన్నారు. రాజకీయాల్లో.. వ్యాపారాల్లో..దేశం కోసం పోరాడే వీర వనితలుగా రాణిస్తున్నారు.

ఇలాంటి సూపర్ స్టార్ మహిళల.. విజయగాధలు ఉమెన్స్ డే స్పెషల్

WWW.MAHAADAILY.COM | శనివారం, హైదరాబాద్ | 08-03-2025

04 మహారాణి

నింగీ నేలా మాదే

సూపర్ స్టార్లు.. శక్తివంతులు...

ఉమెన్స్ డే స్పెషల్

సూపర్ స్టార్ సీతక్క

WOMEN'S DAY SPECIAL

04

## డీలిమిటేషన్ పై రాజుకుంటున్న నిప్పు



- ఏడు రాష్ట్రాల సీఎంలకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ
- ఇప్పటికే బాహాటంగా వ్యతిరేకిస్తున్న స్టాలిన్
- ఈ నెల 22న చెన్నైలో జాయింట్ యాక్షన్ సమావేశం
- వైసీపీ, బీఆర్ఎస్‌లకు కూడా ఆహ్వానం

వివరాలు 2లో

## కేంద్ర నిధుల సాధనకు, రిజర్వేషన్ల పెంపు అంశంపై రేవంత్ మాస్టర్ ప్లాన్



- కేంద్రమంత్రులకు భట్టి ఫోన్
- నేడు ప్రజా భవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల మీటింగ్

వివరాలు 2లో

## ఫోన్‌లోనే ఇంటి నిర్మాణ పర్మిషన్లు




- ట్రెండ్ మార్చేసిన జీహెచ్ఎంసీ
- 10 నుంచి అమల్లోకి

వివరాలు 2లో



## గుజరాత్ మోడల్ టెస్ట్ మ్యాచ్ ఫార్మాట్

# తెలంగాణ మోడల్ ట్వంటీ ట్వంటీ ఫార్మాట్



### మా పోటీ దేశంలోని నగరాలతో కాదు.. న్యూయార్క్, టోక్యోలతో

### తెలంగాణ మోడల్‌తో ఎవరూ పోటీ పడలేరు

ఢిల్లీ వేదికగా ప్రగతినమూనా ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

సీఎం సమయస్ఫూర్తికి జాతీయ మీడియా ప్రశంసలు

**ఢిల్లీ, మహా:** గుజరాత్ రాష్ట్రానిది టెస్ట్ మ్యాచ్ మోడల్ అయితే, తెలంగాణది ట్వంటీ ట్వంటీ మోడల్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. కీలకమైన ఈ మూడింటి సమ్మిళితమైన విధానం కొనసాగించడమే తెలంగాణ మోడల్ అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ పోటీ ఇప్పుడు దేశంలోని ముంబై, బెంగుళూరు, ఢిల్లీ నగరాలతో కాదని, న్యూయార్క్, సియోల్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ అని చెప్పారు. ఢిల్లీలో ఇండియా టుడే కాంక్లేవ్25 లో సీఎం పాల్గొన్నారు. ఈ వేదికపై ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ , ఇండియా టుడే ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ప్రీతి చౌదరి అడిగిన పలు సమకాలీన అంశాలపై రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానాలిచ్చారు. అనేక అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఢిల్లీ వేదికగా ముఖ్యమంత్రి సమాధానాలిచ్చి గ్రౌండ్ ఎలాంటిదైనా బంతిని బౌండరీ దాటిస్తాడన్న ప్రశంసలందుకున్నారు.

**గుజరాత్ లాగా ఇతర రాష్ట్రాలకూ రాయితీలు ఇవ్వాలి**

పెట్టుబడుల విషయంలో గుజరాత్ తరహాలోనే దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మిగతా రాష్ట్రాలకు కూడా రాయితీలు ప్రకటించాలి. రాష్ట్ర ప్రజలు మాపై నమ్మకం ఉంచినందున రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై అడగటం మా బాధ్యత. తెలంగాణకు 7 లక్షల కోట్ల అప్పులున్నాయి. 2014 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం 69 కోట్లు మాత్రమే అప్పులుండేవి.

మిగతా 3లో

### 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

30 వేల ఎకరాల్లో అంతర్జాతీయస్థాయి అత్యంత అద్భుతమైన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. అయిదు సంవత్సరాల తర్వాత హైదరాబాద్ నగరాన్ని చూడండి. హైదరాబాద్ నగరాన్ని ముంబై, బెంగుళూరు, ఢిల్లీతో పోల్చుకోవడం లేదు. న్యూయార్క్, సియోల్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నాం. తెలంగాణ మోడల్‌తో ఎవరూ పోటీ పడలేరు. హైదరాబాద్ అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యమైంది కాదు. కుతుబ్ షాహీ కాలం నుంచి ఈ నగరానికి 450 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రభుత్వాలు మారినా, ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## లక్షమంది మహిళలతో మహిళా దినోత్సవం


### పరేడ్ గ్రౌండ్ వేదికగా మంత్రి సీతక్క అధ్యక్షతన భారీ బహిరంగ సభ

ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి.. హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం, ఇతర మంత్రులు

ఇందిరా మహిళా శక్తి మిషన్2025 ఆవిష్కరణ

**మహా :** అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పరేడ్ గ్రౌండ్ వేదికగా మహిళా సదస్సును తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. సభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆధ్యక్షతన సభ జరగనుంది. సభా వేదికగా లక్ష మంది మహిళల సమక్షంలో ఇందిరా మహిళా శక్తి మిషన్2025 ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు.

మిగతా 2లో






## మహిళలకు సమాన అవకాశాలు రావాలి

- రాజ్యాలు సొంతంగా ఏలేలా మహిళలు ఎదగాలి
- మహిళలే అసలు సిసలైన ఆర్థిక శాస్త్రవేత్తలు
- మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ లో మంత్రి సీతక్క

02



## మహిళలు శక్తి స్వరూపులు

### అలా కొలిచే అద్భుతమైన సాంప్రదాయం భారతదేశానిది

ప్రతి గెలుపులో మహిళల పాత్ర కీలకం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మహా :** మహిళలను శక్తిగా కొలిచే అద్భుతమైన సాంప్రదాయం కేవలం భారతీయ జీవన విధానం, సంస్కృతి ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పురాణాల నుంచి నేటి వరకు కూడా అనేక రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ శక్తి స్వరూపిణుల పేర్లనే ముందుగా ఉచ్ఛరిస్తామని స్పష్టం చేశారు. భారతీయ జీవన విధానంలో ఇల్లును చక్కదిద్దేవారు మాతృమూర్తి అన్నారు. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా పాత్ర కీలకమన్నారు. ఎంపీ, శాసనసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కీలకపాత్ర పోషించారన్నారు. తన ఎంపీ నియోజకవర్గంలో ఐదువేలమంది మహిళలు తమ తమ బూత్‌లలో మహిళా శక్తి పనిచేసిందని తన గెలుపులోనూ వారీ పాత్ర కీలకమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు మహిళలకు అవార్డులను అందజేసి సత్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు.

మిగతా 2లో

# మహిళలు శక్తి స్వరూపులు

## అలా కొలిచే అద్భుతమైన సాంప్రదాయం భారతదేశానిది

### ప్రతి గెలుపులో మహిళల పాత్ర కీలకం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

తాను హోంమంత్రిగా ఉన్నప్పుడు సరిహద్దుల్లోనూ ఆడబిడ్డలు ఏకె 47తో నిరంతరం కాపలా కాస్తున్నారని కొనియాడారు. విమాన రంగంలో అత్యధిక మహిళా పైలెట్లు భారత్ లోనే ఉన్నారని గుర్తు చేశారు. ట్రిపుల్ తలాక్‌రద్దు 12 కోట్ల మంది ముస్లిం ఆడబిడ్డల హక్కులు కాపాడిందన్నారు. అనాదిగా మూడు మాటలతో ఇంటినుంచి గెంటివేసే ప్రక్రియ కొనసాగిందని విమర్శించారు. ఇస్లామిక్ దేశాల్లో కూడా ఈ చట్టం లేదన్నారు. సెక్యూలర్ దేశంలో ట్రిపుల్ తలాక్ పై ఎవ్వరూ మాట్లాడే, వ్యతిరేకంగా వెళ్లే ధైర్యం చేయలేదన్నారు. కానీ మోదీ నాయకత్వంలో ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేసి హక్కులు కల్పించామని అన్నారు.

**ప్రసూతి సెలవులు 26 వారాలు పొడిగింపు**

'భేటీ బచావో.. భేటీ పడావో' కేవలం నినాదం కాదని, ఆడపిల్లలను రక్షించే బృహత్తర కార్యక్రమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలున్నారన్నారు. వాజ్ పేయి ప్రభుత్వ హయాంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు తీసుకొచ్చారన్నారు. మోదీ హయాంలో అత్యధికంగా గ్రూపులు ఉన్నాయన్నారు. ప్రసూతి సెలవులు 26 వారాలు పొడిగించిన ఘనత బీజేపీదే అన్నారు. స్టార్టప్ సంస్థల్లోనూ అత్యధిక సంఖ్యలో పనిచేస్తున్నారని, స్థాపిస్తున్నారన్నారు. మెజార్టీ ఐటీల్లో మహిళలే కీలక పాత్ర పోషిస్తూ నెలకు రూ. 4, రూ. 5 అత్యధిక ప్యాకేజీలు అందుకుంటున్నారని అభినందించారు.

**33 శాతం రిజర్వేషన్లు**

రాజ్యాంగం రూపకల్పన చేసినప్పుడు మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ ఉండాలని చెప్పారని, అనేక చర్చల తరువాత బిల్లులు పెట్టారే గానీ వాటి అమలులో విఫలమయ్యారన్నారు. కానీ మోదీ ప్రభుత్వ హయాంలో కొత్త పార్లమెంట్ లో మహిళలకు 33 శాతం కేటాయించామన్నారు. ఇప్పుడు ఉన్న లెక్క ప్రకారం తెలంగాణలోనూ 40 సీట్లు మహిళలకే దక్కనున్నాయన్నారు. అత్యధిక కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లుగా మహిళలు బీజేపీలోనే ఉన్నారని అన్నారు.



ఉమ్మడి కుటుంబ వ్యవస్థను నిలబెట్టుకోవాలి

తెలంగాణలోనూ మహిళలు అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించాలన్నారు. 2014 తరువాత దురదృష్టవశాత్తు మహిళా మంత్రి లేకుండా బీఆర్ఎస్ పాలించిందన్నారు. మహిళలను అవమానపర్చడం, నిర్లక్ష్యం చేసిందన్నారు. ఐదేళ్లపాటు పాలించడాన్ని మహిళా లోకం ఆలోచించాలన్నారు. మోదీ నేతృత్వంలో మహిళా రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. స్వామి వివేకానంద, బాబా సాహెబ్ అంబేద్కర్, పూలే మహిళా సాధికారతలో ముందంజలో ఉన్నారన్నారు. విద్య, వ్యాపార, సామాజిక, అన్ని రంగాల్లో కుటుంబ వ్యవస్థ, భారతీయ సంస్కృతిని రక్షించుకుంటూ మహిళలు ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. కుటుంబ ఉమ్మడి వ్యవస్థను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**అట్టడుగు వర్గాల మహిళలకు పద్మశ్రీలు**

మోదీ అధికారంలోకి వచ్చాక ఇంకా గుర్తింపు పొందని వారికి గుర్తింపు లభించిందన్నారు. అట్టడుగు వర్గాల మహిళలకు కూడా పద్మశ్రీలు కేటాయించి ఆదర్శంగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కమిట్‌మెంట్ తో పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి,నిజమైన మార్పు సాధ్యమని, భారతీయ సంస్కృతి, జీవన విధానం మెరుగుపడుతుందని మనసా, వాచా నమ్మిన మహిళలందరికీ శిరస్సు వంచి నమస్కరించారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జకట్టి ఉద్యమంలో పాల్గొన్న విషయం తనకు తెలుసన్నారు. తీవ్రమైన వాతావరణంలోనూ ఆడబిడ్డలు పనిచేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచిపోయినా కేసీఆర్ లాగే పరిపాలన ఉందన్నారు. ఫ్రీ బస్సు ఇచ్చానుంటూనే కలలు కనండి అంటూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

**ఎమ్మెల్సీ స్థానాల్లో 90 శాతం ఓట్లు వారివే**

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం ఆహ్వానించతగ్గ స్థాయిలో ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 37 శాతం పోలింగ్ బూత్ లో 33 శాతం ఓట్లు వేశారన్నారు. దేశంలో 70 శాతం మంది బీజేపీని ఆశీర్వదించారన్నారు. కొన్ని జిల్లాల్లో 60 శాతం ఓటింగ్ తమ పార్టీకి లభించిందన్నారు. ఎమ్మెల్సీ మూడు స్థానాల్లో రెండు స్థానాలను నిలబెట్టుకున్నామన్నారు. మహిళా ఉపాధ్యాయులు, పట్టభద్రులు 90 శాతం ఓట్లు బీజేపీకే పడ్డాయని సర్వేలో తేలిందన్నారు. మోదీ నాయకత్వానికి మద్దతిచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వైఫల్యం చెందాయన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకోవాలంటే సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. గొంతెత్తి, పిడికిలి బిగించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ ఎస్ , కాంగ్రెస్ అనేక డిక్లరేషన్ లు ఇచ్చి మభ్యపెట్టారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్యారంటీలు, హామీల పట్ల ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలను పిడికిలి బిగించి నిలదీయాలని అన్నారు.

**సీట్లు తగ్గవు**

ఇప్పటికైనా బీఆర్ఎస్, కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. జనాభా సేకరణపై విపక్షాలు చేస్తున్నవి తప్పుడు ఆరోపణలేనని హోంమంత్రి కేంద్ర కేబినెట్ లో చెప్పారని అన్నారు. ఒక్కటి కూడా తగ్గే అవకాశం లేదన్నారు. తెలంగాణలో 17కు 17, ఏపీలో 25కు 25 సీట్లు ఉంటాయన్నారు. దక్షిణాది ఆల్ పార్టీ సమావేశం పెట్టుకుంటామని బెదిరింపు ధోరణికి దిగుతున్నారని అందుకు తమకు అభ్యంతరం ఏమీ లేదన్నారు. 2009లో పునర్విభజన ఏ రకంగానైతే జరిగిందో అదే రకంగా పునర్విభజనలో చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఫోన్‌లోనే ఇంటి నిర్మాణ పర్మిషన్లు

## ట్రెండ్ మార్చేసిన జీహెచ్ఎంసీ.. 10 నుంచి అమల్లోకి

**మహా :** ఇల్లు కట్టాలంటే అనుముల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిందే. అధికారులు అందుబాటులో ఉన్నా ఆ డాక్యుమెంట్, ఈ పత్రం అంటూ తిప్పుతూనే ఉంటారు. నెలల తరబడి తిరిగితే తప్ప అనుమతి వస్తుందో లేదో తెలియని పరిస్థితి. అయితే.. ఇప్పుడు ఆ తిప్పలు తప్పినట్టే. కూర్చున్న చోటు నుంచే ఇంటి నిర్మాణ అనుమతులు పొందే అవకాశాన్ని కల్పించింది జీహెచ్ఎంసీ. నగరవాసుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుందో లేక, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారుతుందో.. ఇక నుంచి ఇంటి నిర్మాణ అనుమతులు ఫోన్ ద్వారానే ఇచ్చే సౌలభ్యాన్ని కల్పిస్తోంది. ఫోన్‌లోనే 'బిల్డ్ నౌ' వెబ్‌సైట్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు పరిశీలించి గరిష్ఠంగా 15 రోజుల్లో అనుమతి పొందవచ్చని జీహెచ్ఎంసీ చెప్తోంది. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేయనుండటం గమనార్హం. ఇంటి స్థల విస్తీర్ణం 75 గజాల్లోపు ఉంటే దరఖాస్తును సమర్పించగానే వెంటనే అనుమతి వచ్చేస్తుంది. ఈ కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదటగా హైదరాబాద్ పరిధిలో అందుబాటులోకి తీసుకురానుంది. మార్చి 10వ తేదీ నుంచి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. ఈ 'బిల్డ్ నౌ' యాప్ నిమిషాల్లోనే ఇంటి డ్రాయింగ్ పరిశీలిస్తుంది. భవన నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌లు రూపొందించే డ్రాయింగ్‌ను ప్రామాణికంగా తీసుకోనుంది. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ పరిశీలనకు కొన్ని వారాల సమయం పడుతుండగా ఈ యాప్ మాత్రం నిమిషాల్లోనే పరిశీలించి అనుమతి తొందరగా వచ్చే అవకాశాన్ని కల్పించనుంది. అంతేకాకుండా.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపక శాఖ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నింటితో 'బిల్డ్ నౌ' యాప్‌తో అనుసంధానమై పని చేయనుంది. ఈ యాప్ ద్వారా కేవలం దరఖాస్తు చేసుకుని పర్మిషన్ పొందటమే కాకుండా దరఖాస్తుకు సంబంధించిన అప్‌డేట్స్ ఏ అధికారి వద్ద పెండింగులో ఉంది, ఇతరత్రా వివరాలను దరఖాస్తుదారు తెలుసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన సమాచారం తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందుబాటులో ఉండనుంది. సామాన్యుడు సైతం తనకున్న ఇంటి స్థలంలో ఎన్ని అంతస్థులు కట్టుకోవచ్చు, సెట్ బ్యాక్ ఎంత వదలాలి, దరఖాస్తు విధానం గురించి వెబ్‌సైట్‌లోనే పూర్తి వివరాలు ఉంటాయి. ప్రశ్న అడిగితే చాలు ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి నిబంధనలతో సహా సూచనలు కూడా యాప్ అందించనుంది. డ్రాయింగ్ ప్రకారం 3డీ ఇంటి నమూనాలను కూడా ఈ యాప్‌లో చూసే అవకాశం ఉంది.




# మహిళలకు పీసీసీ చీఫ్ శుభాకాంక్షలు

## మహిళా సాధికారితకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట- మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మహిళలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉక్కుమహిళ ఇందిరా గాంధీ వారసత్వాన్ని కొనసాగిస్తూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తోందని, మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకి పెద్ద పీట వేస్తూ ఇందిరా మహిళా శక్తి పథకాలను ప్రకటించడం కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద బ్యాంకు రుణాలతో ప్రతి మండల మహిళా సంఘానికి ఒక్కో బస్సు చొప్పున మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి అద్దెకి ఇచ్చేలా చర్యలు చేపట్టిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పొందుతున్న మహిళలే మరోవైపు




బస్సుల యజమానులుగా మారి రెండు వైపులా ప్రయోజనం పొందేలా గొప్ప నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పలు మహిళా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, మహిళలు పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు.



# డీలిమిటేషన్ పై

## రాజుకుంటున్న నిప్పు

మహా : లోక్ సభ స్థానాల పునర్ విభజన (డీలిమిటేషన్) అంశం దక్షిణాది రాష్ట్రాల్లో కాక పుట్టిస్తోంది. డీలిమిటేషన్ జరిగితే దక్షిణ భారతదేశంలో లోక్ సభ సీట్ల సంఖ్య తగ్గుతుందని జనాభా ఎక్కువగా ఉండే ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్ సభ స్థానాల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డీలిమిటేషన్ కు ససేమిరా అంటున్నారు. తమిళనాడులో కొత్త జంటలు వీలైనంత త్వరగా పిల్లలు కనాలని ఆయన పిలుపునిచ్చారు. తద్వారా తమిళనాడు జనాభా పెరిగితే, డీలిమిటేషన్ లో లబ్ధి కలుగుతుందన్నది స్టాలిన్ ఆలోచన. ఈ క్రమంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. డీలిమిటేషన్ అంశంపై ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్ విభజనకు వ్యతిరేకంగా తమతో కలిసి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలకు లేఖ రాశారు. మార్చి 22న చెన్నైలో జరిగే సంయుక్త కార్యాచరణ సమావేశానికి ఆయా రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. ఈ జాయింట్ యాక్షన్ సమావేశానికి రావాలంటూ ఏడు రాష్ట్రాల విపక్ష నేతలకు కూడా స్టాలిన్ ఆహ్వానం పలికారు. స్టాలిన్ నుంచి ఆహ్వానం అందుకున్న పార్టీల్లో వైసీపీ, బీఆర్ఎస్ కూడా ఉన్నాయి. కేవలం రాజకీయ సంస్థలుగా కాకుండా ప్రజల భవిష్యత్ రక్షకులుగా ఐక్యంగా నిలబడదామని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ అనేది సమాఖ్య వాదంపై కేంద్రం చేస్తున్న దాడి అని స్టాలిన్ స్పష్టం చేశారు. గతంలో ఎంతో కష్టపడి జనాభా నియంత్రణ చేపట్టిన రాష్ట్రాలకు పార్లమెంటులో హక్కులు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు.

# ఇందిరా మహిళా శక్తి మిషన్-2025

## రేవంత్ సర్కార్ సంచలన పాలసీ.. మహిళా దినోత్సవం సందర్భంగా నేడు విడుదల

### మహిళల ఆర్థిక స్వేచ్ఛా, ఉపాధి కల్పన, సంపద సృష్టిపై ప్రభుత్వం ఫోకస్

**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వేదికగా ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 పాలసీని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మహిళా స్వయం సహాయక బృందాల విజయాలతో పాటు భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశిస్తూ ఇందిరా మహిళ శక్తి మిషన్ - 2025.. మహిళల ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన, సంపద సృష్టిపై ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకుని ఫోకస్ పెట్టింది. ఐకమత్యమే మహాబలం అనే నానుడిని నిజం చేసేలా ఒకే గొడుగు కిందకు గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలు రానున్నాయి. స్వయం సహాయక సంఘాల పరిధిని విస్తృత పరిచేలా సభ్యుల అర్హత వయసు పెంచనున్నారు. కిశోర బాలికలు, వయోవృద్ధుల ఆర్థిక భద్రత, సామాజిక మద్దతు కోసం నూతన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. సభ్యుల కనీస వయస్సు 18 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గింపుతో పాటు గరిష్ట వయసు 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేశారు.

**ఈ ఏడాది సాధించిన విజయాలు**

మహిళా సంఘాలకు రూ. 21,632 కోట్ల రుణాలు
2,25,110 సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటు
రూ. 110 కోట్లతో 22 జిల్లాల్లో చురుకుగా ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం
రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు
గ్రామీణ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్ తో అనుసంధానించడం కోసం మాదాపూర్ లోనీ శిల్పారామంలో రూ. 9 కోట్లతో ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం
మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫామ్ కుట్టే పనిని అప్పగించడం ద్వారా రూ. 30 కోట్ల ఆదాయం
ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు.
అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఇప్పటికే రూ. 634 కోట్ల విలువగల 23,701 పనులు
మహిళా సంఘ సభ్యులకు రెండు లక్షల రుణ బీమా, 10 లక్షల ప్రమాద బీమా. 400 మందికి రూ. 40 కోట్ల ప్రమాద బీమా చెల్లింపు. 32 జిల్లాల్లో అందుబాటులోకి 32 మొబైల్ ఫిష్ రిటైల్ ట్రక్కులు, ప్రతి ట్రక్కుపై ఆరు లక్షల సబ్సిడీ. మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి ఏర్పాట్లు. మహిళా సంఘాల ద్వారా 600 ఆర్టిసి అద్దె బస్సుల నిర్వహణ. 32 జిల్లాల్లో మహిళా సమాఖ్యల పెట్రోల్ బంకులు. తెలంగాణ మహిళా శక్తికి మరింత ఊతమిచ్చేలా ఇందిరా మహిళ శక్తి మిషన్ - 202

# 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

## కరీంనగర్ సీపీగా గౌస్ ఆలం

### వరంగల్ సీపీగా సన్ ప్రీత్ సింగ్

**మహా :** రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బదిలీ ఐన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు ఉన్నారు. ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు సైతం స్థాన చలనం కల్పించారు. మిగిలిన 14 మంది ఎస్పీలను కూడా బదిలీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలంను నియమించారు.

**బదిలీ అయిన అధికారుల వివరాలు..**

కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం
అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్.
అలాగే ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు.
సీఐడీ డీజీగా ఎం.శ్రీనివాసులు
వరంగల్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్
నిజామాబాద్ కమిషనర్‌గా సాయి చైతన్య
రామగుండం కమిషనర్‌గా అంబర్ కిషోర్
ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధు శర్మ
భువనగిరి డీసీపీగా అకాంక్ష యాదవ్
మహిళా భద్రతా విభాగం ఎస్పీగా చేతన
నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్
కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర
సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్

## కేంద్ర నిధుల సాధనకు, రిజర్వేషన్ల పెంపు అంశంపై

# రేవంత్ మాస్టర్ ప్లాన్

## కేంద్రమంత్రులకు భట్టి ఫోన్

### నేడు ప్రజా భవన్ లో ఆల్ పార్టీ ఎంపీల మీటింగ్

**మహా :** ప్రజాభవన్‌లో నేడు ఆల్ పార్టీ ఎంపీల సమావేశం జరుగనుంది. కేంద్రంలో పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంజెడాగా ఈ సమావేశం జరుగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరుకానున్నారు. అలాగేకేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు ఆహ్వానం పంపారు. అలాగే తెలంగాణ ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు. ఆల్ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలోనే నిర్ణయించారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీని వేసి ఆల్ పార్టీ సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అఖిలపక్షంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నిన్న కేబినెట్‌లో తీర్మానం చేయడంతో పాటు భట్టి, జానా నేతృత్వంలో కమిటీని కూడా వేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ స్వయంగా అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీలకు భట్టి ఫోన్‌లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. రేపు ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. భట్టి, జానారెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. బీజేపీకి సంబంధించిన ఎంపీలను కూడా సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందులో ప్రధానంగా కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కూడా ఆహ్వానాన్ని పంపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి వారిని సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ప్రధానంగా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచనలో తెలంగాణ రాష్ట్ర సర్కార్ ఉంది. అందుకు సంబంధించిన ముసాయిదా బిల్లును కూడా సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ బిల్లును కూడా సిద్ధం చేయడంతో పాటు నిన్న కేబినెట్ భేటీ ఆమోద ముద్ర కూడా పడింది. ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఆ బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించి షెడ్యూల్ 9కి మార్పు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుకునే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని ప్రభుత్వం కోరనుంది. అందులో భాగంగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని పార్టీలు తమతో కలిసి రావాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఈ నేపథ్యంలో ఆల్ పార్టీ ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- **2.5 శాతం డీఏ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం**
- **ఎక్స్ వేదికగా వెల్లడించిన మంత్రి పొన్నం**

మహా : ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యాజమాన్యంతో చర్చించి ఉద్యోగులకు 2.5శాతం డీఏ ప్రకటిస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డీఏ చెల్లింపుతో ప్రతినెలా ఆర్టీసీపై రూ. 3.6కోట్ల అదనపు భారం పడుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ 'ఎక్స్' వేదికగా ఆర్టీసీ ఉద్యోగులకు 2.5శాతం డీఏ విషయాన్ని ప్రకటించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, దాదాపు 5వేల కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఉచితంగా పొందారన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం తరువాత దాదాపు ప్రతిరోజూ 14 లక్షల మహిళలు అదనంగా ప్రయాణం చేస్తున్నారని, దీనివల్ల ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగినా వారు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి పొన్నం అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తుందని, మహిళా ప్రయాణికులు అదనంగా పెరగడంతో ఆర్టీసీ బస్సుల డిమాండ్ పెరిగిందని మంత్రి తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా మొదటిసారి మహిళా సంఘాల చేత ఆర్టీసీ బస్సులు అద్దె ప్రాతిపదికన పెట్టి బస్సులకు యజమానులను చేస్తూ మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

# లక్షమంది మహిళలతో మహిళా దినోత్సవం


## పరేడ్ గ్రౌండ్ వేదికగా మంత్రి సీతక్క అధ్యక్షతన భారీ బహిరంగ సభ

### ముఖ్య అతిధిగా సీఎం రేవంత్ రెడ్డి.. హజరుకానున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం, ఇతర మంత్రులు ఇందిరా మహిళా శక్తి మిషన్2025 ఆవిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

మహిళా సంఘాలు ఈ ఏడాది సాధించిన విజయాలతో పాటు, మహిళా సాధికారత బలోపేతం కోసం ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను ఇందిరా మహిళా శక్తి మిషన్2025 లో పొందు పరిచారు. అయితే ఇందిరా మహిళా శక్తి మిషన్2025 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు 32 జిల్లాల నుంచి మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలుండటంతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. మహిళా సభ్యులను సభకు ఆహ్వానిస్తూ మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా సమాఖ్యలకు ఆహ్వానాలు పంపారు. గౌరవ అతిధులుగా హాజరై సభను సక్సెస్ చేసి మహిళా సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం 600 కు పైగా ఆర్టీసీ బస్సులను సెర్ప్ అందుబాటులో ఉంచింది. దీంతో పాటు జిల్లాకొక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించింది. మహిళలు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి ఇంటికి సురక్షితంగా చేరుకునే వరకు ఈ అధికారులు సమన్వయం చేస్తారు. ఎక్కడ ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పించారు. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలంతా అరగంట ముందే సభా స్థలికి చేరుకునేలా ప్లాన్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వచ్చే అవకాశాలుండటంతో ఏడున్నర గంటలలోపు సభను ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



**గ్రౌండ్ ను సందర్శించిన సీతక్క**

సభ ఏర్పాట్లపై మంత్రి సీతక్క శుక్రవారం పరేడ్ గ్రౌండ్ ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఏలాంటి అసౌకర్యం జరక్కుండా ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో జిల్లా డీఆర్డీఏ, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కాలమైనందున జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాటర్ బాటిల్స్, టవల్స్ ప్రతి ఒక్కరి వద్ద ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**కార్యక్రమ వివరాలు**

మహిళా సాధికారత, ప్రభుత్వ కృషి, మహిళా సంఘాల విజయాలపై కల్చరల్ ప్రోగ్రాంలు, పాటలు
మండల మహిళా సమైక్య సంఘాలచే నడిచే 150 ఆర్టీసీ అద్దె బస్సులను పచ్చా జెండా ఊపి సీఎం, మంత్రులు ప్రారంభిస్తారు.
మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్ల సందర్శిస్తారు.
సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ప్రసంగాలు
వేదికపై 31 జిల్లా సమాఖ్యలచే 31 జిల్లాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అయిల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు
మహిళా సంఘ సభ్యులకు లోన్ భీమా, ప్రమాధ భీమా చెక్కులను అందచేస్తారు
మహిళా సంఘాలకు రుణ సదుపాయిన్ని కల్పిస్తూ చెక్కును జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులకు అందచేస్తారు.
జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు యునిఫాం చీరల పంపిణి కార్యక్రమం ఉంటుంది.

# మహిళలకు సమాన అవకాశాలు రావాలి

## రాజ్యాలు సొంతగా ఏలేలా మహిళలు ఎదగాలి

### మహిళలే అసలు సిసలు ఆర్థిక శాస్త్రవేత్తలు

### మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ లో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా:** మహిళలు ఎంత ఎదిగినా సమాజంలో సమాన అవకాశాలు రావడం లేదని, రాజ్యాలు సొంతంగా ఏలేలా మహిళలు ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క అన్నారు. యూసఫ్ గూడా లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ ప్రాంగణంలో మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, భూగర్భం నుండి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలన్నారు. మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవమని, మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగినా వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. మహిళలు ఎమ్మెల్యేలు మంత్రులు ఐఎఎస్ లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని, ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలని, కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదని, ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలన్నారు. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలన్నారు. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు రావాలన్నారు. లింగ అంతరాలను తుంచితినే




సమాజంలో సమానత్వం ఉంటుందని, శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయన్నారు. వాటన్నిటినీ అధిగమించి మహిళలు ముందంజ వేస్తున్నారని, మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలని, ఆదిశగానే ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందన్నారు. మహిళలకు అనుకూలంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, అనుభవజ్ఞులంతా సలహాలు సూచనలు చేస్తే, అందుకు అనుగుణంగా నూతన విధానాన్ని రూపొందిస్తామన్నారు. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నాయని, పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామన్నారు. మరిన్ని వ్యాపారాల్లోకి మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టామన్నారు. మహిళలు రాజ్యాలు సొంతంగా ఏలేలా మహిళలు ఎదగాలని, మహిళలే అసలు సిసలు ఆర్థిక శాస్త్రవేత్తలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అతివలు అపూర్వ విజయాలు సాధిస్తున్నారన్నారు.





# గుజరాత్ మోడల్ టెస్ట్ మ్యాచ్ ఫార్మాట్

# తెలంగాణ మోడల్ ట్వెంటీ ట్వెంటీ ఫార్మాట్

(మొదటిపేజీ తరువాయి)
ప్రస్తుతం తెలంగాణ ఆదాయం నెలకు 18,500 కోట్లు మాత్రమే. జీతాలకు, అప్పులపై అసలు వడ్డీలకే 13 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం కనీసం నెలకు 500 కోట్లు కేటాయించలేని పరిస్థితులున్నాయి. ఇలాంటి అంశాలపై జాతీయస్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

**డీలిమిటేషన్ పై అభిప్రాయాలు తీసుకోవాలి**

2026 లో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టడానికి ముందు అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవాలి. దీనిపై ముందు చర్చ జరగాలి. రాజకీయ కోణంలో దక్షిణాదికి నష్టం జరిగే నిర్ణయాలు సరికాదు. దేశంలో కులగణన ఎందుకు జరగకూడదు. అందులో తప్పేముంది. బీసీల జనాభాను ఎందుకు లెక్కించకూడదు. ఎస్సీ, ఎస్టీ లెక్కలు తేల్చినట్టుగానే బీసీల గణాంకాలు సేకరించడంలో ఇబ్బందేంటి. వారి డిమాండ్ సమంజసమైనప్పుడు బీసీ జనాభా ప్రాతిపదికన వారికి రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేముంది. ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నారు. ఓబీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వకూడదు.

**హిందీ బలవంతంగా రుద్దొద్దు**

హిందీ నేర్చుకోవడమన్నది ఒక ఐచ్ఛికంగా మాత్రమే ఉండాలి. బలవంతంగా రుద్దకూడదు. కాలేజీల్లో ఫ్రెంచ్, జర్మనీ వంటి ఎన్నో భాషలు ఉన్నాయి. ఎవరికి ఏదిష్టముంటే దాన్ని నేర్చుకుంటారు. హిందీని నేర్చుకోవడాన్ని వ్యతిరేకించడం లేదు. బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించవద్దనేదే మా అభిప్రాయం. హిందీ నేర్చుకోవడం వల్ల ప్రయోజనం ఉందంటే నేర్చుకుంటారు. హైదరాబాద్ వేదికగా ఒలంపిక్ క్రీడలు నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని ప్రధానమంత్రి మోదీ కి విజ్ఞప్తి చేశాం. క్రీడలకు హైదరాబాద్ ఒక మంచి కేంద్రం. ప్రపంచ మిలటరీ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఏషియన్ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించాం. ఎంతో మంది ప్రపంచ స్థాయి క్రీడాకారులు తెలంగాణ నుంచి ఉన్నారు. హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో ఏది ఉత్తమమైన నగరమో అంతర్జాతీయ ఒలింపిక్ అసోషియేషన్ నిర్ణయించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.

# వచ్చే ఒలింపిక్స్ కు అహ్మదాబాద్ కన్నా హైదరాబాద్ మిన్న

## రేవంత్ రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ను ఎక్కడికి తీసుకెళ్తారో చూడండి

## నేను భద్రాచలం రావాలని మోదీ, అమిత్ షాను ఆహ్వానించినా రాలేదు

## ఇండియా టుడే కాంక్లేవ్... 2025 లో రాజ్ దీప్ తో సీఎం

**ఢిల్లీ:** ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న ఇండియా టుడే కాంక్లేవ్... 2025 ఆసక్తికరంగా సాగింది.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** భారత రాజకీయాల్లో ఎదుగుతున్న నేత రేవంత్ రెడ్డి... దేశంలో ఉన్న ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లో చిన్న వయస్కుడు.. 55 ఏళ్లు... ఆయన పార్టీలో ఎదుగుతున్న నాయకునిగా ఎక్కువ మంది విశ్వసిస్తున్నారు..? ఆయనకు స్వాగతం పలకండి.. మిస్టర్ రేవంత్... నన్ను ఒక బీజేపీ నేత అడగమన్నారు..? మేం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వచించిన గుజరాత్ మోడల్‌ను దేశం ముందుచాం.. కాంగ్రెస్‌కు అటువంటి మోడల్ ఏమైనా ఉందా..? కాంగ్రెస్‌కు అటువంటి రాష్ట్రం మోడల్ ఏమైనా ఉందా దేశం ముందు ఉంచేందుకు..? బీజేపీకి గుజరాత్ మోడల్ ఉన్నట్లు మీకు తెలంగాణ మోడల్ ఉందా..?

**రేవంత్ రెడ్డి:** గుజరాత్ నమూనా కాలం చెల్లిన నమూనా (గుజరాత్ మోడల్ ఇజ్ అవుట్ డేటెడ్ మోడల్) అది టెస్ట్ మ్యాచ్ మోడల్... తెలంగాణది 2020 నమూనా (మోడల్). తెలంగాణ నమూనానే దేశానికి నమూనా. గుజరాత్ నమూనాలో ఏవిధమైన సంక్షేమం లేదు. ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అది మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రయత్నించిందే.. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత గుజరాత్ మార్కెటింగ్‌కు ఎవరైనా అంబాసిడర్ ఉన్నారా? లేరా? మోదీనే సొంతంగా గుజరాత్ కోసం పోరాడుతున్నారు... మోదీ ఈ దేశానికి ప్రధానమంత్రి.. ప్రధానమంత్రి దేశంలో ఏమూలకైనా పెట్టుబడులు వస్తే వాటికి ఆయన మద్దతు ఇవ్వడం లేదు. ఎవరైనా దేశానికి పెట్టుబడులు పెట్టడానికి వస్తే గుజరాత్‌కు వెళ్లి పెట్టుబడులు పెట్టమని చెబుతున్నారు... ఇదేం పద్ధతి..?

**రాజ్‌దీప్ సర్దేశాయ్: గుజరాత్ నమూనాకు మీ తెలంగాణ నమూనాకు మధ్య తేడా ఏమిటి?**

**రేవంత్ రెడ్డి:** నాది అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన నమూనా... ఈ మూడు మా ప్రాధాన్యాంశాలు.. అహ్మదాబాద్.. హైదరాబాద్ లోని మౌలిక వసతులను పోల్చి చూడండి.. మా హైదరాబాద్‌లో ఉన్న వసతులు.. అహ్మదాబాద్‌లో ఉన్న వసతులు చూడండి. హైదరాబాద్‌తో పోటీ పడే ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం అహ్మదాబాద్‌కు ఉన్నాయా? గుజరాత్‌లో ఫార్మా, ఐటీ పెట్టుబడులు ఉన్నాయా..? గుజరాత్‌లో ఏం ఉంది? నేను అహ్మదాబాద్, ముంబయి, బెంగళూర్, ఢిల్లీతో పోటీ పడడం లేదు.. నేను న్యూయార్క్, సియోల్, టోక్యో తో పోటీపడాలనుకుంటున్నాం. మా తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీ పడలేరు.

**రాజ్‌దీప్ సర్దేశాయ్: భవిష్యత్ అవసరాలకు తగిన నగరాల నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణలో అహ్మదాబాద్‌తో పోల్చుకుంటే హైదరాబాద్... గుజరాత్‌తో పోల్చుకుంటే తెలంగాణ ముందున్నాయని మీరు బహిరంగ సవాల్ విసురుతున్నారా?**

**రేవంత్ రెడ్డి:** అవును.. వంద శాతం.. అందుకే మేం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన నగరం నిర్మించే పని ప్రారంభించాం... అయిదేళ్ల తర్వాత వచ్చి చూడండి... ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మించబోతున్నాం. గుజరాత్, అహ్మదాబాద్‌లో అటువంటి నగరం ఎక్కడైనా ఉందా..? కోవిడ్ సమయంలో ఔషధాలు ఎక్కడ తయారయ్యాయి. మూడో వంతు ఔషధాలు మేం సరఫరా చేశాం. భారతదేశంలోని 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయి. ఐటీ గురించి మేం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్‌లో ఐటీ ఏం ఉంది.. అహ్మదాబాద్ ఐటీ, హైదరాబాద్ ఐటీ ఎగుమతులు చూడండి..

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** మీరు చెప్పే హైదరాబాద్, తెలంగాణ నమూనా 2023లో ప్రారంభమైందా..? 2014లోనే దేశం ప్రయాణం ప్రారంభమైందని మోదీ చెప్పినట్లుగానే మీరు 2023లో తెలంగాణ నమూనా ప్రారంభమైందని క్లెయిమ్ చేసుకోకూడదుగా..? చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ లు కొంత ఖ్యాతికి అర్హులు కదా? మీరు దానిని ముందుకు తీసుకుపోతున్నారు.. ప్రతి రాజకీయ నాయకుడు తమతో మొదలవుతుందని భావిస్తున్నారు..?

**రేవంత్ రెడ్డి:** మీరు సగం నిజమే చెప్పారు. నేను పూర్తి వాస్తవం చెబుతా.. ఇది ఇప్పుడు ప్రారంభమైంది కాదు.. కులీ కుతుబ్ షాహీ నుంచి ప్రారంభమైంది. కులీ కుతుబ్ షా తర్వాత నిజాం సర్కార్, తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తర్వాత మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి.. అలా ఆ తర్వాత ఇప్పుడు నేను ఉన్నా... 450 ఏళ్లకుపైగా చరిత్ర తెలంగాణ, హైదరాబాద్‌కు ఉంది. చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు కట్టారా? సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు కట్టారా..? హైదరాబాద్‌లో ప్రముఖ కట్టడాలన్నీ 450 ఏళ్ల నుంచే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు మారినా ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కొనసాగింది. మీరు హైదరాబాద్ రండి.. ప్రపంచంలోనే అత్యుత్తమైన గాజులు, ముత్యాలు చార్మినార్ వద్ద దొరుకుతాయి. ఇప్పుడు డాలర్ల మార్పిడి చేస్తున్నాం...400 ఏళ్ల క్రితమే అక్కడ నగదు మార్పిడి ఉంది... ప్రపంచంలోని ఎక్కడ నగదు (నోట్) తీసుకువచ్చినా అక్కడ మార్చుకోవచ్చు...

**ప్రీతి:** మీరు ప్రధానమంత్రి మోదీ, గుజరాత్‌పై దాడి ప్రారంభించారు.. ప్రధానమంత్రి వికసిత్ భారత్ గురించి మాట్లాడుతుంటే మీరు తెలంగాణ మోడల్ గురించి చెబుతున్నారు. తెలంగాణ వన్ ట్రిలియన్ ఎకానమీ అంటున్నారు.. ఆయనది అబద్ధం (జుమ్లా) మీది విజన్ అంటున్నారు...ఎలా..?

**రేవంత్ రెడ్డి:** నేను ఎవరిది అబద్ధం (జుమ్లా) అనడం లేదు. నేను ఒక్కటే సూటిగా చెప్పాలనుకుంటున్నా.. ఎవరిపై పక్షపాతం చూపొద్దు అంటున్నా... మోదీ గిఫ్ట్ సిటీ తీసుకెళ్లారు. ఎవరైనా విదేశీయుడు గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెడితే లాభాలు వాళ్ల దేశానికి తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు. భారతదేశంలో ఇతర రాష్ట్రాలకు ఎందుకు ఆ అవకాశం ఇవ్వలేదు. మోదీ ఈ దేశానికి ప్రధానమంత్రి.. అలాంటప్పుడు గిఫ్ట్ సిటీకి ఎందుకు ప్రత్యేక రాయితీలు ఇచ్చారు. నేను ఈ మీడియా ద్వారా మోదీ, బీజేపీని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్న....మీరు గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెట్టేవారికి ఎన్నో ప్రత్యేక అవకాశాలు, రాయితీలు ఇచ్చారు.. నిబంధనలు అతిక్రమించి గిఫ్ట్ సిటీలో ప్రయోజనాలు కల్పిస్తున్నారు.. హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వరు. గిఫ్ట్ సిటీలో యూనివర్సిటీ, పరిశ్రమ ఏ పెట్టుబడి వచ్చినా లాభాలు ఆయా దేశాలకు తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు.. హైదరాబాద్‌కు ఆ అవకాశం ఎందుకు ఇవ్వరు?

**ప్రీతి:** మోదీతో మంచి సంబంధాలున్న మీరు ఒక్కసారిగా ఆయనతో యుద్ధం ప్రారంభించారు ఎందుకు?

**రేవంత్ రెడ్డి:** మోదీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవు.. నేను మోదీ విధానాలతో విభేదిస్తున్నా. మోదీ దేశానికి ప్రధానమంత్రి ఆయనకు గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి మా రాష్ట్రానికి కావల్సినవి అడగడం నా హక్కు, బాధ్యత.. ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రి చేశారు..

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** హైదరాబాద్ భవిష్యత్ నగరంగా నిర్మిస్తామని అంటున్నారు... ఏ భవిష్యత్ నగరానికైనా పెట్టుబడులు అవసరం. మీ బడ్జెట్‌ను చూస్తే రూ.3.50 లక్షల కోట్ల అప్పు ఉంది. మీరు అనేక హామీలు ఇచ్చారు. నిరుద్యోగులకు రూ.4 వేలు, రైతులు, కూలీలకు హామీలు ఇచ్చారు. మీ దగ్గర నిధులు లేనప్పుడు అవన్నీ నెరవేర్చడం సవాల్ అని మీరు అనుకోవడం లేదా..?

**రేవంత్ రెడ్డి:** కేసీఆర్ సృష్టించిన భావనలో మీరు, మా ప్రజలు ఉన్నారు. తెలంగాణ అప్పులు రూ. 3.50 లక్షల కోట్లు కాదు. రూ.7 లక్షల కోట్లు. 2014లో మేం తెలంగాణ ఏర్పాటు చేసినప్పుడు రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.69 వేల కోట్లు. కేసీఆర్ పదేళ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు. మా రాష్ట్రానికి ఇప్పుడు నెలకు ఉన్న ఆదాయం రూ.18,500 కోట్లు...జీతాలు,పింఛన్లకు నెలకు రూ.6,500 కోట్లు, ఈ అప్పులకు వడ్డీలకు రూ.6,500 కోట్లు నెలకు మేం కట్టాలి. మేం తిన్నా తినకపోయినా.. టీ తాగినా, తాగకపోయినా ప్రతి నెల పదో తేదీ లోపు రూ.13 వేల కోట్లు చొప్పున కట్టాలి. మిగిలిన రూ.5 వేల కోట్లు, రూ.5,500 కోట్లతో మేం అభివృద్ధి, సంక్షేమం చేపట్టాలి.

**ప్రీతి: కానీ ఈ గ్యారంటీలు సరైనవి కాదుగా...**

**రేవంత్ రెడ్డి:** ఇది ఒక వ్యక్తిని అడగకూడదు...దీనిపై చర్చ జరగాలి...నేను అబద్ధం చెప్పడం లేదు. వీటిపై అంతా మాట్లాడాలి. గదిలో ఒకటి మాట్లాడుతున్నారు.. బయట మరొకటి మాట్లాడుతున్నారు...

**రాజ్ దీప్ సర్దేశాయ్: దీనిపై దేశవ్యాప్త చర్చ జరగాలి అంటున్నారా...**

**రేవంత్ రెడ్డి:** ఒకే దేశం ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై కాకుండా వీటిపై చర్చ జరగాలి. మూల ధన వ్యయంపై (క్యాపిటల్ ఎక్సెపెండేచర్) చర్చ జరగాలి. నేను నెలకు రూ.500 కోట్లు కూడా క్యాపిటల్ ఎక్సెపెండేచర్‌పై పెట్టలేకపోతున్నా. రానున్న రోజుల్లో రాష్ట్రం, దేశం ఏం కావాలి..

**రాజ్‌దీప్ సర్దేశాయ్: నియోజకవర్గాల పునర్విభజన టిక్కింగ్ టైంబాంబ్ అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అంటున్నారు...? మీరు ఆయనతో ఏకీభవిస్తున్నారా...**

**రేవంత్ రెడ్డి:** మొట్ట మొదట నేనే ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఈ అంశాన్ని లేవనెత్తా. ఏం చేసినా బీజేపీకి దక్షిణాదిలో ఏం రావడం లేదు. దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకు నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని బీజేపీ ఎంచుకుంది. దక్షిణాది ప్రాతినిధ్యాన్నితగ్గించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఇందులో ప్రతీకారం ఏముంది.. చట్ట ప్రకారం 2026 జనాభా లెక్కల అనంతరం సీట్ల సంఖ్య ఉంటుంది.. ఎక్కడ ప్రతీకారం ఉంది. ఎందుకు మీరు దీనిని దక్షిణాది.. ఉత్తరాది పోరుగా చూస్తున్నారు...?

**రేవంత్ రెడ్డి:** మంచి ప్రశ్న అడిగారు. కుటుంబ నియంత్రణ చేపట్టాలని ఎవరు ఆదేశించారు. కుటుంబ నియంత్రణ వచ్చాకే మేం ఇద్దరం.. మాకు ఇద్దరం.. మేం ఇద్దరం.. మాకు ఒక్కరు నినాదాలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే దక్షిణాది అమలు చేసింది. ప్రభుత్వం చెప్పింది చేస్తే మాపై ప్రతీకారం తీర్చుకుంటారా.? కుటుంబ నియంత్రణ విధానానికి ముందైన 1971 లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టండి.

**ప్రీతి:** దక్షిణాది పార్టీలు తమ హిస్టీరియాను చాటుకుంటున్నాయని అమిత్ షా అంటున్నారు...?

**రేవంత్ రెడ్డి:** దక్షిణాది రాష్ట్రాలే కాదు పంజాబ్ నుంచి మనీష్ తివారి ఏం చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు నష్టమే. బీమారు (బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్) రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధిపొందుతున్నాయని చెబుతున్నారు.

**రాజ్‌దీప్ సర్దేశాయ్: ఎం.కె.స్టాలిన్ ఎక్కువ మంది పిల్లలను కనమంటున్నారు.. దానిని సమర్థిస్తున్నారా..?**

**రేవంత్ రెడ్డి:** అది వేరే అంశం..దానికి సమయం ఉంది...30 ఏళ్ల తర్వాత చేపట్టమనండి... అప్పుడు దక్షిణాది సత్తా ఆధారంగా సంఖ్య పెరుగుతుంది.. (నవ్వులు).. అప్పుడు మా నియోజకవర్గాలు పెరుగతాయి...

**రాజ్‌దీప్ సర్దేశాయ్: అంటే మీరు స్టాలిన్ ను సమర్థిస్తున్నారు... 30 ఏళ్ల తర్వాత చేపట్టమంటున్నారు..**

**రేవంత్ రెడ్డి:** ఈ దేశంలో ప్రతి రాష్ట్రానికి కొన్ని హక్కులున్నాయి.. ఇది రాష్ట్రాల సమాఖ్య.. దక్షిణాదిలో బీజేపీకి అధికారం లేదు.. ప్రాతినిధ్యం లేదు.. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని శిక్షించే పనులు చేయకూడదు.

**రాజ్‌దీప్ సర్దేశాయ్: మరి మీరు గ్యారంటీలు అన్ని ఎలా చేయగలరు..?**

**రేవంత్ రెడ్డి:** సరైన ప్రశ్న రాజ్‌దీప్.. మీలాగే నేను కూడా రాష్ట్రానికి రూ.3.75 లక్షల కోట్ల అప్ప ఉందనుకున్నా. వచ్చే ఆదాయంతో అన్నీ చేయగలమనుకున్నా. కుర్చీలో కూర్చున్న తర్వాత అసలు విషయం బయటపడింది.

**రాజ్‌దీప్ సర్దేశాయ్: ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్యారంటీలు చేయలేమని మీరు చెబుతున్నారా..?**

**రేవంత్ రెడ్డి:** నేను గ్యారంటీల గురించి చెప్పడం లేదు.. నేను అప్పులకు తిరిగి చెల్లించే గ్యారంటీల గురించి చెబుతున్నా...నేను గ్యారంటీలు చేయమని చెప్పడం లేదు. మా పరుగు సాగుతోంది.. మా పరుగును సాగనివ్వండి...వేగం ఉత్తేజాన్నిస్తుంది.. కానీ చంపేస్తుంది తెలుసుగా.. (స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్) (అంతా నవ్వులు). మోదీ ఢిల్లీలో అనేక గ్యారంటీలు ఇచ్చారు.. ఎవరూ మోడీని ప్రశ్నించడం లేదు... మోదీ గ్యారంటీలకు వ్యతిరేకమైతే ఢిల్లీలో ఎందుకు గ్యారంటీలు ఇచ్చారు. మేం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణాలను మూడు నెలల్లోపు మాఫీ చేశాం. భారతదేశంలో తొలిసారి నేను ఇంత రుణమాఫీ చేశా... ఇప్పటి వరకు ఎవరూ చేయలేదు...

**రాజ్‌దీప్: హిందువులు, ముస్లింలు...**

**రేవంత్ రెడ్డి:** హిందూ, ముస్లిం, క్రైస్తవం ఎవరివైనా...? 200 ఏళ్లకుపైగా పాలించిన బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత ఆంగ్లో ఇండియన్లకు పార్లమెంట్, అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇచ్చాం...

**ప్రీతి: డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది పార్టీలు ఏకమవుతాయంటున్నారు.. త్రి భాషా విధానంపై....**

**రేవంత్ రెడ్డి:** వాస్తవానికి దక్షిణాది పార్టీలే కాదు మొత్తం దక్షిణాది ప్రజలు...బీజేపీ మాతో లేదు.. ఏ భాషా నేర్చుకోమని జబర్దస్ చేయాల్సిన అవసరం లేదు. కాలేజీల్లో మనం ఫ్రెంచ్, జర్మన్, సంస్కృతం నేర్చుకుంటాం.. హిందీ అధికార భాష కాదు.. ఎక్కువ మంది మాట్లాడే భాష.. తర్వాత తెలుగు, బెంగాలీ. ఎక్కువ మంది మాట్లాడతారు. హిందీ కోసం మోదీ, అమిత్ షా ఎందుకు పట్టుపడుతున్నారు. హిందీని పట్టుకొని తెలుగు, బెంగాలీని ఎందుకు వదిలేస్తున్నారు.. హిందీ ఆప్షనల్‌గా ఉంటే మాకు ఇబ్బంది లేదు.. నేను ఇప్పుడు హిందీలోనే మాట్లాడుతున్నా.. కానీ మమ్మల్ని ఎక్కువగా కొట్టాలని చూడొద్దు... మేం దానికి వ్యతిరేకం... బిజినెస్, ఉద్యోగం కోసం ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాం.. ఇది మన మాతృ భాష కాదు..

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** మీరు ప్రమాదంలో ఉన్నారు. దేశంలో కేవలం ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఉన్నారు.. మీరు హర్యానా, మహారాష్ట్ర ఓడిపోయారు. తెలంగాణను తప్పించి మిగతా చోట్ల ఓడిపోతున్నారు. మీరు ఎందుకు ఎన్నికల్లో ఓడిపోతున్నారు..? వారు ఎందుకు వరుసగా గెలుస్తున్నారు..

**రేవంత్ రెడ్డి:** మాకు అనుబంధ సంస్థలుగా యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ ఉన్నాయి. బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ ఉన్నాయి.. వారు నైస్ ఆర్ ఐస్‌తో పోరాడుతున్నారు.. నైస్ అంటే నార్కొటిక్స్, ఇన్‌కంటాక్స్ బ్యూరో, సీబీఐ, ఐడీ... ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి బీజేపీవారి నుంచి నైస్ కావాలా. ఐస్ కావాలా అని ఫోన్ వస్తుంది. నైస్ వస్తే జైలుకు పోతారు. ఐస్ వస్తే బీజేపీ టిక్కెట్ వస్తుంది...

**రాజ్‌దీప్: మీరు తెలంగాణలో గెలిచి మిగతా చోట ఎందుకు గెలవడం లేదు..?**

**రేవంత్ రెడ్డి:** అత్యంత ప్రజాస్వామ్యయుతంగా, ఉదారంగా ఉండడమే మా బలహీనత..50 ఏళ్లు రాజ్యసభ సభ్యులుగా ఉన్నవాళ్ళు కూడా తర్వాత టికెట్ ఇవ్వకపోతే మా నేతలు జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తారు. మీరు ఇంటర్వ్యూలు చేస్తారు.. బీజేపీలో అద్వానీ, మనోహర్‌జోషి వంటి పెద్ద నేతలను పక్కనపెట్టిన ఒక్కరూ మాట్లాడరు...

**ప్రీతి:** ప్రమాదంలో ఉన్న ముగ్గురిలో ఒకరని రాజ్‌దీప్ సర్దేశాయ్ చెప్పారు.. మీరు ప్రధానమంత్రితో సన్నిహితంగా ఉన్నందున పార్టీ అగ్రనాయకత్వం గుర్రుగా ఉందంటున్నారు...

**రేవంత్ రెడ్డి:** పార్టీ వేరు.. ప్రభుత్వం వేరు... ప్రభుత్వాలు కలిసి పని చేస్తాయి... ముఖ్యమంత్రిగా నేను ప్రధానమంత్రిని గౌరవిస్తా.. నేను పార్టీ వేదికపై పార్టీ విషయాలు మాట్లాడతా...

**రాజ్‌దీప్:** మీ రాష్ట్రంలో స్కిల్ యూనిర్సిటీకి గౌతం అదానీ రూ.వంద కోట్లు ఆఫర్ చేస్తే మీరు తిరస్కరించారు. మీ పార్టీ అగ్ర నాయకత్వం, రాహుల్ గాంధీ వ్యతిరేకించారా..?

**రేవంత్ రెడ్డి:** పార్టీ వ్యతిరేకించలేదు.. మా ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకించాయి.. ప్రజలకు కోసం రూ. 100 కోట్లను తేవాలనుకున్నా. బీజేపీ అదానీ నుంచి తీసుకున్న బాండ్లను ఎందుకు వెనక్కి ఇవ్వలేదు... నేను వెనక్కి ఇచ్చా.. నేను ఎటువంటి అపవాదు ఎదుర్కొందల్చుకోలేదు.

**రాజ్‌దీప్: మీరు మహా కుంభ్‌మేళా వెళ్లలేదా..?**

**రేవంత్ రెడ్డి:** మా కుటుంబం వెళ్లింది. నేను భద్రాచలం రావాలని మోదీ, అమిత్ షాను ఆహ్వానించినా రాలేదు. మా గ్రామంలోనూ రామ మందిరం ఉంది.. భద్రాచలం పరమ పవిత్ర క్షేత్రమని నేను నమ్ముతా.. అయినా మోదీ, అమిత్ రావడం లేదు. (నవ్వులు)

**ప్రీతి: రాహుల్ గాంధీ కుంభ్‌మేళా వెళ్లాలని మీరు అనుకోలేదా...**

**రేవంత్ రెడ్డి:** అవకాశం దొరికిందాన్ని బట్టి ఉంటుంది.. రాజ్‌దీప్ మీరు వెళ్లారా...?

**రాజ్‌దీప్: నేను 2008లో వెళ్లా..**

**రేవంత్ రెడ్డి:** అంటే, ఇప్పుడు వెళ్లలేదా..?

**రాజ్‌దీప్:** ఈసారి వెళ్లలేదు...

**రేవంత్ రెడ్డి:** ప్రీతి మీరు వెళ్లారా..?

**ప్రీతి:** నేను రాజకీయాల్లో లేను.. నేను రాజకీయవేత్తను కాను...

**రేవంత్ రెడ్డి:** మీరు, నేను (రాజకీయ నేతలు, జర్నలిస్టులు) ప్రజా జీవితంలోనే ఉన్నాం..

**రాజ్‌దీప్:** రేపు క్రీడా శాఖ మంత్రి హైదరాబాద్ వస్తున్నారు. వచ్చే ఒలింపిక్స్‌కు అహ్మదాబాద్ కన్నా హైదరాబాద్ మిన్న అని మీరు చెబుతారా...

**రేవంత్ రెడ్డి:** నేను ఇప్పటికే క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు వినతిప్రతం ఇచ్చా.. హైదరాబాద్ ఇప్పటికే మిలటరీ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. నిఖత్ జరీన్, సానియా మీర్జా, పి.వి.సింధు సహా ఒలింపిక్స్, క్రికెట్ లో రాణించిన వారంతా తెలంగాణ నుంచి వచ్చారు... అహ్మదాబాద్ కన్నా మా దగ్గర వంద రెట్లు ఎక్కువగా వసతులున్నాయి. మీరు నిజ నిర్ధారణ బృందం పంపండి.. అహ్మదాబాద్, హైదరాబాద్‌ల్లో ఏమేం వసతులున్నాయో తేల్చండి.. ఒలింపిక్స్ గేమ్స్ హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని మేం ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రపంచ సుందరి పోటీలు మేలో హైదరాబాద్‌లో జరగబోతున్నాయి. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఎందుకు ఒలింపిక్స్ జరగకూడదు.

**రాజ్ దీప్:** అహ్మదాబాద్.. హైదరాబాద్ ఏదో తేల్చుకోవాలని ఒలింపిక్స్ ప్రతినిధులకు రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు..?.

**రేవంత్ రెడ్డి:** అహ్మదాబాద్ కు నరేంద్ర మోదీ బ్రాండ్ అంబాసిడర్... హైదరాబాద్ బ్రాండ్‌ను రేవంత్ రెడ్డి ఎక్కడికి తీసుకెళతారో చూడండి.

భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా మహిళలు పలు రంగాల్లో రాణిస్తున్నారు. తమ ప్రతిభా పాటవాలను కనబరుస్తున్నారు. నింగీ నేలా మాదేనంటు ఆకాశంలో కూడా గెలుపు సంతకాలు చేస్తున్నారు. సంప్రదాయాల సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛావాయువులు పీలుస్తూ..ప్రతిభతో ఎదుగుతున్నారు. ఆడవారంటూ బలహీనులు కాదు బలవంతులని నిరూపిస్తున్నారు. బిలియన్ డాలర్ల కంపెనీలల్లో కీలకంగా వ్యవహరిస్తు సీవోల స్థాయిల్లో కంపెనీలను విజయతీరాలవైపు నడిపిస్తున్నారు. స్టార్టప్ లతో మొదలై కోట్ల టర్నోవర్లకు చేరుకుంటూ అటు కుటుంబాలను ఇటు వ్యాపారాలను సమర్థవంతంగా నడిపిస్తున్నా మహిళలు ఎంతోమంది ఉన్నారు. రాజకీయాల్లో.. వ్యాపారాల్లో..దేశం కోసం పోరాడే వీర వనితలుగా రాణిస్తున్నారు.

**ఇలాంటి సూపర్ స్టార్ మహిళల.. విజయగాధలు ఉమెన్స్ డే స్పెషల్**



# నింగీ నేలా మాదే

## సూపర్ స్టార్లు.. శక్తివంతులు...

## ఉమెన్స్ డే స్పెషల్




## సూపర్ స్టార్ సీతక్క

అడవి నుంచి అధికారం వరకు.. ఆదివాసీ పల్లెల నుంచి ఢిల్లీ మన్ననలు పొందేవరకు.. ఆమె ప్రస్థానంలో ఎన్నో మలుపులు, మరెన్నో కష్టాలు. ప్రజల కోసం ప్రజల పక్షాన అడవి బాట పట్టిన ఒకప్పటి అక్క ఇప్పుడు ఆ అడవి బిడ్డల ఆశలకు, వారి అభివృద్ధికి వారధి. ఆమెది చిన్నపటి నుంచి తమ ఉద్యమ ప్రభావిత ప్రాంతం. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వచ్చిన గుత్తికోయలు ఎదుర్కొంటున్న సమస్యలపై పీహెచ్‌డీ చేశారు. చదువుకునే రోజుల్లోనే చిన్న చిన్న సమస్యలపై ప్రశ్నించడం, అదే విధంగా సహాయం చేయడం అలవాటైంది. అనసూయగా ప్రారంభమై సీతక్కగా ప్రజల మన్ననలు పొంది ఇప్పుడు డాక్టర్ అనసూయ సీతక్కగా రాష్ట్ర సర్కార్‌లో మంత్రి పదవి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా కొనసాగుతూ.. మంత్రిగా తనదైన ప్రత్యేకముద్ర వేస్తున్నారు. దేశంలో ఎక్కడా మహిళలకు అమలుకాని అనేక పథకాలు పట్టుబట్టి అమలుచేయిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. హేమాహేమీలు నిర్వహించిన పంచాయతీరాజ్ శాఖను అద్భుతంగా నిర్వహిస్తూ పల్లెప్రగతిపై తన ముద్ర వేస్తున్నారు. సామాన్యుల నాయకురాలిగా ఆమె జనం గుండెలు గెలిచారు. సీతక్క తెలంగాణ కేబినెట్ లో సూపర్ స్టార్ మినిస్టర్. ఆమె ఎక్కడికి వెళ్ళినా ఓ క్రేజ్. ఆత్మీయురాలుగా.. నిగర్విగా, మన కోసం పనిచేసే మహానేతగా సామాన్యులు అల్లుకుపోతారు. ఎల్బీ స్టేడియంలో వేలాది మంది సమక్షంలో తెలంగాణ మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించిన క్రమంలో ఆమె వేదిక పైకి వెళ్తుండగా పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణ స్వీకారం చేయమని సంకేతాలు ఇచ్చేలోపే ఆమె కాసేపు ఆగి చేతులు జోడించి నమస్కరించారు. ప్రమాణ స్వీకారం తర్వాత తనను సోదరిలా భావించే రేవంత్ రెడ్డితో కరచాలనం చేశారు. అనంతరం సీతక్క కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీల వద్దకు వెళ్లి వారి పాదాలను తాకి ఆశీస్సులు తీసుకున్నారు. సోనియా గాంధీ లేచి నిలబడి ఆమెను కౌగిలించుకుని అభినందనలు తెలిపారు. ఇదే క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కరచాలనం చేశారు. ఈ క్షణాలు చూసిన చాలా మంది గిరిజన బిడ్డలు భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల నుండి వెల్లువెత్తిన స్పందన ఆమె జన హృదయాలు ఎలా గెలిచిందో స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ మెచ్చిన నాయకురాలు సీతక్క. గత ఏడాదికాలంలో మహిళా సంఘాలకు రూ. 21,632 కోట్ల రుణాలు ఇప్పించిన ఘనత సీతక్కదే. మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి ఏర్పాట్లు చేయడంతో పాటు మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీతక్క నాయకత్వంలో అడుగులు పడుతున్నాయి. మహిళలకే పెట్రోల్ బంక్ లు, మహిళలకే ఆర్టీసీ అద్దె బస్సులు ఇలా ఎన్నో కార్యక్రమాలతో తెలంగాణ మహిళాసంక్షేమంలో స్పెషల్ గా నిలుపుతోంది.

## స్మితా సభర్వాల్ రోల్ మోడల్



స్మితా సభర్వాల్.. తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరంటే అతి శయోక్తి కాదు . గత దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారీ ఐఏఎస్ ఆఫీసర్. సీఎం ప్రత్యేక కార్యదర్శితో పాటు నీటి పారుదల శాఖ బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన స్మిత సభరాల్ ప్రభుత్వ పెద్దల, ప్రజల మెప్పు పొందారు. పనితీరులో అందరికీ ఆదర్శంగా ఉంటూనే.. తన వేషధారణ, కట్టుబొట్టుతో తెలంగాణకే కాకుండా దేశంలోని ఎందరో యువతులకు రోల్ మోడల్ గా నిలుస్తున్నారు స్మితా సభర్వాల్. ఆత్మవిశ్వాసం తొణికిసలాడే నిఖార్సయిన నాయకురాలు స్మితాసభర్వాల్. ఐఏఎస్ గా ఆమె పనితీరు ఎంతోమంది ఐఏఎస్ లు సాధించేందుకు స్ఫూర్తిగా నిలిచింది. స్మితా సభర్వాల్ పేరు చెప్పగానే గ్రామీణ తెలంగాణం.. కృతజ్ఞతాభిమానం చాటుకుంటుంది. రోడ్లు వేసి, నీళ్లు తెప్పించి, బస్ షెల్టర్లు కట్టించిన దొరసాని అంటూ గ్రామాల్లోని పెద్దవాళ్లు చేతులెత్తి మొక్కుతారు కూడా. అంతటి పేరు తెచ్చుకుని, రికార్డులు, అవార్డులు సాధించిన ఈ ఐఏఎస్ ఆఫీసర్ ఇప్పుడు వైవిధ్యాన్ని చూపుతున్నారు. సోషల్ మీడియాలో ప్రధానంగా ఇన్‌స్టాలో ఇన్‌ఫ్లెయన్సర్ గా మారి తన పోస్టులతో స్ఫూర్తిని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తున్నారు. గతంలో సీఎంలో కీలక అధికారిగా పనిచేసిన స్మిత హెలికాప్టర్ మీద ప్రాజెక్టులను సందర్శించి.. ఒక ఐఏఎస్ అధికారికి ఈ స్థాయి అధికారాలు లభిస్తాయా అంటూ ఆశ్చర్యపరిచారు. ఆమె పనితీరు, సమర్థతతో అందరూ ఆశ్చర్యపడే అనేక శిఖరాలు అధిగమించారు. అభివృద్ధిలో కీలకమైన రూరల్ డెవలప్ మెంట్, మిషన్ భగీరథ, హరితహారం లాంటి ఎన్నో ముఖ్యమైన ప్రాజెక్టుల్లో తనదైన ముద్రవేసిన స్మిత ఇపుడు ఈ ప్రభుత్వంలో టూరిజం పాలసీలో కీలక భూమిక నిర్వహిస్తున్నారు. జరూర్ ఆనా అంటూ తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్నారు. 2025 మిస్ వరల్డ్ పోటీల నిర్వహణలో స్మితా సభ్వాల్ దే కీ రోల్. బాధ్యతలు నెరవేర్చుతూ డెడికేషన్ ఉన్న ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్న స్మిత సభర్వాల్ సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటారు. స్ఫూర్తిదాయక పనితీరుకు స్మితా సభర్వాల్ ఓ మోడల్. కొన్నేళ్లుగా ట్విట్టర్ లో యాక్టివ్ గా ఉంటున్నారు స్మిత సభర్వాల్. ఇన్‌స్టాలోనూ యాక్టివిటీ పెంచారు. 24 ఏళ్లుగా పబ్లిక్ సర్వీస్ లో బిజీగా గడుపుతూనే ఉన్న స్మిత.. వీకెండ్స్ లో, వెకేషన్ లో కుటుంబంతో కలిపి గడుపుతున్న ఆనందపు అనుభూతులను సోషల్ మీడియా ఫ్రెండ్స్ తోనూ షేర్ చేసుకుంటున్నారు. ఔత్సాహిక యువత సివిల్స్ సాధించేందుకు ఆమె ప్రేరణ కలిగిస్తున్నారు.

### ది పీపుల్స్ ఆఫీసర్

స్మితా సభర్వాల్ కు ది పీపుల్స్ ఆఫీసర్ గా పేరు. ప్రజలతో చురుగ్గా కనెక్ట్ కావడం, పాలనా ప్రక్రియలలో వారి అభిప్రాయాలను కోరడం వంటి ప్రత్యేక పరిపాలనా శైలికి సభర్వాల్ "ది పీపుల్స్ ఆఫీసర్" అనే మారుపేరును సంపాదించారు. పౌరులు తమ సమస్యలను నేరుగా పరిపాలనకు తెలియజేయగల, పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించే వేదిక "ప్రజా వాణి" అనే భావనకు ఆమె మార్గదర్శకత్వం వహించారు. ఎన్నో వినూత్న కార్యక్రమాలను రూపొందించారు.

## శిఖా గోయల్

### స్ఫూర్తిదాయక ప్రయాణం




కాశ్మీర్ లోని టెర్రరిస్టులైనా.. సైబర్ నేరస్తులైనా సరే.. ఆమె టార్గెట్ నుంచి తప్పించుకోలేరు. ఏ కేసు ఫైల్ అయినా.. ఆమె టేబుల్ మీదకు వస్తే.. ఫర్ఫెక్ట్ ఇన్వెస్టిగేషన్ తో నిందితులకు శిక్ష పడుతుంది. ఆమె.. డేర్ అండ్ డైనమిక్ ఐపిఎస్ ఆఫీసర్ శిఖా గోయల్. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్సెస్ మరియు ఉమెన్ సేఫ్టీ వింగ్ వంటి కీలక విభాగాలకు నాయకత్వం వహించే తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శిఖా గోయెల్ సైబర్ నేరాల్లో పోయిన డబ్బును తిరిగి పొందడంలో తెలంగాణ డీజీపీ శిఖా గోయెల్ నాయకత్వంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

### డేరింగ్ అండ్ డాషింగ్

శిక్షణ పూర్తి అయిన తర్వాత ఫస్ట్ పోస్టింగ్ జమ్మూలో వచ్చింది. అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ జమ్ముగా ఉద్యోగంలో చేరాను. అప్పటివరకు ట్రైనింగ్ లో భాగంగా ఆ ప్రాంతమంతా బాగా తెలిసినప్పటికీ. డ్యూటీలో చేరగానే కాస్త థ్రిల్లింగ్ ఫీలయ్యాను. అక్కడ టెర్రరిస్టుల సమస్య ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత అడిషనల్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ (క్రైమ్, రైల్వేస్)గా పనిచేశాను అని తన ఉద్యోగం తొలిరోజులు పంచుకున్నారు శిఖగోయల్. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన షీటీమ్స్ విజయవంతంగా పనిచేస్తూ.. హైదరాబాద్ లో ఈవ్ టీజింగ్, మహిళలపై దాడులు, నేరాలను చాలావరకు అదుపు చేశాయి. ఉమెన్ సేఫ్టీకి పెద్దపేట వేస్తూ.. అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్కూల్స్, కాలేజీలు, బస్ స్టాపులు, ఆఫీస్ లు ఇలా ఆడపిల్లలు ఉండే ప్రతిచోట ప్రత్యేకమైన నిఘా విభాగాలను ఏర్పాటుచేశాం. మహిళల్లో ఆత్మధైర్యం పెంచేలా సెల్ఫ్ డిఫెన్స్ లో శిక్షణ ఇస్తున్నాం. సైబర్ నేరాలు 20 శాతం పెరిగినా రికవరీలో దేశంలో టాప్ గా తెలంగాణ నిలుస్తోంది.

# సమాజ అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకం

■ బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే
■ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో మహిళా దినోత్సవ వేడుకలు



**వరంగల్, మహా;** సమాజ అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకం అని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యు బి ఐ) వారి ఆధ్వర్యంలో హనుమకొండ లోని పా పడమ్స్ కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి లో అతివల పాత్ర కీలకమని సామాజిక ఆర్థిక రాజకీయ లో మహిళల భాగస్వామ్యం పెరగాలని జీ డ బ్ల్యూ ఏం సి శానిటేషన్ విభాగం లో సగం వరకు పారిశుధ్య సిబ్బంది మహిళలే నని కష్టపడి పని చేస్తూ నగరాన్ని శుభ్రం చేయడం లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని బల్దియా తరపున మెప్మా కు చెందిన విభాగం లో సుమారు 1 లక్ష 15 వేల మంది మహిళలు ఎస్ హెచ్ జీ బృందాల్లో సభ్యులు గా ఉన్నారని వారికి ఆర్థిక పరిపుష్టి అందించడానికి ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా లోన్ లను అందించి ప్రోత్సాహం అందిస్తున్నామని బ్యాంకర్ లు ప్రస్తుతం లోన్ ల పరిమితి పెంచి అందజేయాలని కోరారు. ఇంతే కాకుండా నగరానికి సంబంధించి మంత్రి ఏం పి తో పాటు వరంగల్ హన్మకొండ జిల్లా ల కలెక్టర్లు కమిషనర్ గా తాను వివిధ విభాగాల్లో ఉన్నతాధికారులు గా మహిళలు వారి సేవలు అందిస్తున్నారని బల్దియా అడ్మినిస్ట్రేటివ్ విభాగం లో కూడా అనేక మంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారని పెన్షన్ లకు సంబంధించి ఒంటరి మహిళా వితంతు వృద్ధాప్య పెన్షన్ ల అందజేతలో సమస్యలు లేకుండా చూడాలని బ్యాంకర్ లకు కమిషనర్ తెలిపారు. అనంతరం జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి మన్సూర అసీబా ను కమిషనర్ బ్యాంకు ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పలుగుల సత్యం ఏజిఎంలు మహేష్ శ్రీరామ్ ఆగ్రో ఇన్చార్జి జీవన్ కుమార్ ఎల్ డి ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.


# మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

■ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి
■ ఎంచుకున్న లక్ష్యాలపై దృష్టి సారించాలి
■ ఎంపీ డా.కడియం కావ్య



**హన్మకొండ, మహా;** హన్మకొండ వడ్డేపల్లిలోని పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మహిళ దినోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యతోనే మహిళా సాధికారిత సాధ్యమని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. మహిళలంతా ఆర్థికంగా బలంగా మారడంతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఉన్నత భవిష్యత్తు కోసం నిరంతరంగా సాధన చేసి అత్యుత్తమ ప్రగతిని సాధించాలని తెలిపారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించగలమని అతివలు రుజువు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఇంటిని చక్కదిద్దడం లోనే కాదు..అంతరిక్షంలోనూ విహరిస్తున్నారని తెలిపారు. దేశ రక్షణలోనూ మేము సైతం అంటూ బాధ్యతలు తీసుకుని, విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. క్రీడలు, వ్యవసాయం, వైద్యం, విద్య, రాజకీయం..ఏ రంగమైనా ఆకాశమేహద్దుగా మహిళలు దూసుకుపోతున్నారని తెలియజేసారు. యువత ఆకర్షణలతో పెడదోరణి పట్టి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎంచుకున్న లక్ష్యాలపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, గురువులు పెట్టుకొన్న ఆశలను నెరవేర్చాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కడియం ఫౌండేషన్ ద్వారా విద్యార్థినిలకు శానిటరీ న్యాప్కిన్‌లు అందజేయడం జరిగిందని తెలిపారు. అలాగే గర్భిణిలకు న్యూట్రిషన్ కిట్స్ ను అందించామన్నారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా ఎంపీ గారిని కళాశాల అధ్యాపకులు శాలువతో సత్కరించారు. IQAC కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ సుహాసిని, కోఆర్డినేటర్ సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ అరుణ ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.






# హలో పద్మశాలి..ఛలో హైదరాబాద్



**కాటారం, మహా :** హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఈనెల తొమ్మిదవ తేదీ ఆదివారం రోజున జరిగే 17 వ అఖిలభారత పద్మశాలి సంఘం మహాసభ మరియు ఎనిమిదవ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో పద్మశాలీలు హాజరై పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గోనె భాస్కర్ కోరారు. శుక్రవారం భూపాలపల్లి రెడ్డి కాలనీ మంజునాథ టెక్స్టైల్స్ వద్ద హలో పద్మశాలి చలో హైదరాబాద్ పోస్టర్ ను జిల్లా అధ్యక్షులు గోనె భాస్కర్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు ఆవిష్కరించారు. తమ హక్కుల సాధనకు పద్మశాలీలంతా ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలుపుతూ, రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకవెళ్ళనున్నట్లు తెలిపారు.ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభ కు జిల్లాలోని అన్ని గ్రామాల నుండి పద్మశాలీలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు షేర్ కుమార్, భీమనాథుని సత్యనారాయణ, క్యాతం సతీష్ కుమార్ పాసిగంటి శ్రీనివాస్, కొండబత్తుని మార్కండేయ, పల్నాటి రవీందర్, రాచర్ల చంద్రమౌళి, గుండేటి శ్రీనివాస్, పెనుమల్ల రమేష్, కుసుమ చంద్రశేఖర్, కోడలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జన్ ఔషద్ యోజన దినోత్సవం


■ జనరిక్ మందులతో పేదలకు వెసులుబాటు
■ ప్రైవేటు జనరిక్ మందులలోని ఫార్ములా ఒక్కటే
■ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రధాన మంత్రి జన్ ఔషద్ యోజన కేంద్రానికి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన్ ఔషద్ యోజన దినోత్సవంలో ముఖ్యాతిథిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొని, అనంతరం జన్ ఔషద్ కేంద్రంలోని మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజల దృష్టిలో పెట్టుకుని, జన్ ఔషద్ కేంద్రంలో నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరకు అందించడం జరుగుతుందని తెలిపారు. పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలు ప్రచారాలతో ప్రజల దృష్టిని మళ్లించి తమ మందులను కొనే విధంగా చేస్తారని చెప్పారు. జనరిక్ ఫార్మసీలో దొరికే మందులు, ప్రైవేట్ ఫార్మసీలో దొరికే మందులు ఒకటేనని, ఆ మందులోని ఫార్ములా రోగంపై ఒకే విధంగా పని చేస్తుందని తెలిపారు. జన్ ఔషద్ కేంద్ర నిర్వాహకులు రోగులకు నాణ్యమైన మందులను అందించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రైవేటు పరం కావడంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు వెనుకబడిపోతున్నాయని, వాటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని అన్నారు. విద్యా, వైద్యం పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ రెండు పేద ప్రజలకు అందినప్పుడే వారు ఆర్థికంగా బలపడతారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చాక ఫార్మసీలపై దృష్టి పెట్టారని, పేద ప్రజలకు తక్కువ ధరలోనే మెడిసిన్ దొరికే విధంగా, జనరిక్ ఫార్మసీ పేరుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకోవచ్చారని తెలిపారు. దీర్ఘ కాలిక సమస్యలు ఉన్నవారు జనరిక్ ఫార్మసీలో తక్కువ ధరలో మందులు తీసుకోవచ్చు అని సూచించారు. ఇతర దేశాలతో పోలిస్తే మందుల ధరలు మన దేశంలోనే ఎక్కువగా ఉంటాయని ఇది పేద ప్రజలపై పెను భారంగా మారుతుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు, మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పలువురు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలి

■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా:** శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో మున్సిపల్, గ్రామ పంచాయతిల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించుట, వేసవిలో మొక్కల సంరక్షణ చర్యలు తదితర అంశాలపై మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు...ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్ధాలు సేకరణ జరగాలని ఆదేశించారు. వ్యర్ధాలు ఆరుబయట వేస్తే జరిమానాలు విధించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చికెన్, చేపలు, మాసం విక్రయించే వ్యాపారులకు అలాగే నిత్యావసర సరుకులు విక్రయించే వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు చేయొద్దని నోటీస్ జారీ చేయాలని సూచించారు. నాన్ వెజ్ వ్యర్ధాలు రహదారుల వెంబడి వేస్తున్నారని, నోటీసులు జారీ చేసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం ప్రకారం జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పరిశుభ్రతా నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన వ్యర్థాలతో డంపింగ్ యార్డుల్లో వర్మీ కంపోస్టు తయారీ చేయాలని, అట్టి వర్మీ ఎరువులు మొక్కలకు.వినియోగించాలని తెలిపారు. వ్యర్థాలను ఆదాయ వనరుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, వాటికి సమయానికి నీరు అందేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీఓలు, పంచాయతి కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

■ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబ



**హన్మకొండ, మహా:** ముందు తరాలతో పోల్చుకుంటే ప్రస్తుత తరంలో మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ..ప్రస్తుత సమాజంలో మహిళలు వెనుకబడి లేరని,అన్ని రంగాల్లో ముందు నిలుస్తున్నారన్నారు. ముందు తరాలతో పోల్చుకుంటే విభిన్న రంగాల్లో ముందున్నామన్నారు. కలెక్టర్లు, పోలీస్, తదితర ఎన్నో ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఎందులోనూ తీసుపోలేరని, ఉద్యోగాలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, అందుకు కలెక్టర్లు, తదితర ఎంతోమంది ఉద్యోగులే నిదర్శనం అని అన్నారు. ఒకరికొకరు గౌరవించుకున్నప్పుడే సమాజం ఎంతో ముందుకు వెళ్తుందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలన్నారు. మహిళలు జీవిత మార్గంలో లక్ష్యాన్ని కష్టపడి సాధించాలన్నారు. మనం కష్టపడి సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నప్పుడు ఎంతో సంతోషం వేస్తుందన్నారు. విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు మరెంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్నో అవరోధాలను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా అధికారులు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను ప్రోత్సహించినప్పుడు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని అన్నారు. భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకమని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. సమాజంలో స్త్రీల పట్ల వివక్షను రూపుమాపే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించాలన్నారు. టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ వరంగల్ జిల్లాల మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వివిధ పోటీలలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. వివిధ బాధ్యతలలో ఎంతో ఒత్తిడి ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరింత ఉత్సాహన్ని కలగజేస్తాయన్నారు . తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్లో కీలక బాధ్యతల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కడియం



**స్టేషన్ ఘనపూర్, మహా ;** ఈ నెల 16వ తేదీన తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో రఘునాథ్ పల్లి మండలం, గోవర్ధనగిరి గ్రామ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలన్ని సీఎం సభా ఏర్పాట్ల కోసం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ఏర్పాట్లకు అనువుగా ఉంటుందా, ప్రధాన వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలి, పార్కింగ్ ఎక్కడ ఉండాలి అనే అంశాలపై అధికారులు,నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ, మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్ కు చెందిన వారు. గత 2012 సంవత్సరంలో ములుగు ఏ. ఎస్పీ, వరంగల్ రూరల్ ఓ ఎస్ డి గా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గాను, ఎస్పీగా జగిత్యాల్ లో పనిచేశారని ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ అయినారు.

## పోలీసులపై ఐజి క్రమశిక్షణ చర్యలు

**మహబూబాబాద్ జిల్లా,మహ ;** పెద్ద వంగర పోలీస్ స్టేషన్ పైన విశ్రాంతి గదిలో ఇద్దరు బయట వ్యక్తులతో కలిసి మద్యం సేవించారనే ఆరోపణలతో సోషల్ మీడియా లో వైరల్ ఐన ఫోటో ఘటనపై విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్ రాజా రాము, కానిస్టేబుల్ సుధాకర్ ల పై మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రిపోర్ట్ పంపగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐ.జి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

■ పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, మహా :** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శుక్రవారం పరకాల పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం నందు మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అధికారులు పర్యటించి నీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేయాలి అని,అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయడం,నీటి శుద్ధి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వర్తించాలని అన్నారు.వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి, అక్కడ నీటి సరఫరాను పర్యవేక్షించాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫర చేయాలని అన్నారు.వేసవి లో తాగునీటి సరఫరాలో అంతరాయం, సమస్యలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, అనుమతులు పొందుతూ పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- వీరవనితలుగా మహిళలు ఎదగాలి
- ధైర్య సాహసాలను పెంపొందించుకోవాలి
- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాధిక




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో, మహిళా సాధికారత విభాగము మరియు జాతీయ సేవా పథకం మహిళా విభాగం ఆధ్వర్యంలో, వివిధ సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. అహల్యా బాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శుక్రవారం కళాశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, నీలాద్రి హాస్పిటల్ హస్తినాపురం నుండి విచ్చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మినర్వా ఆధ్వర్యంలో మహిళా విద్యార్థులకు రక్త పరీక్ష మరియు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రాధిక అధ్యక్షత వహిస్తూ విద్యార్థినులు అందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఆరోగ్యవంతమైన మహిళలు కుటుంబాన్ని చక్కగా పరిరక్షించుకోగలరని తెలిపారు. అలాగే వీరవనితలు అహల్యా బాయి హోల్కర్ మరియు రాణి రుద్రమ దేవి ధైర్య సాహసాలను, కార్య దక్షతను, పాలనాపటిమను, ప్రజా సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు ఏదైనా సాధించగలమని ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకొని, అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతూ, అన్నిరంగాలలో పై చేయి సాధించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని అధ్యాపకులందరూ ప్రిన్సిపాల్ తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అహల్య బాయి హోల్కర్ త్రిశతాబ్ది జన్మదినోత్సవం సందర్భంగా అధ్యాపకులు ఎన్ సురేష్ మాట్లాడుతూ... ఆమె తెగువను, పరిపాలన దక్షతను, సంస్కృతి పరిరక్షణను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త మహిళా సాధికారత కన్వీనర్ డాక్టర్ పి సురేఖ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ. రచన, డాక్టర్ రాకేష్ భవాని, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, అధ్యాపకులు డాక్టర్ రమేష్, డాక్టర్ నీలిమ, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మా పెద్ద సారు సరిగా రారు..

- సమస్యలు పట్టించుకోరు..
- తరగతిగది బయట విద్యార్థుల నిరసన




**ఆదిలాబాద్ మహా :** తమ పాఠశాలలో పలు సమస్యలు వేధిస్తున్నాయంటూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్(బి) జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతులు బహిష్కరంచి క్లాస్ రూమ్ బయట కూర్చుని నిరసన తెలియజేశారు. తమ సమస్యలు చెప్పుకుందామంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సరిగా రాడని వచ్చినప్పుడు కూడా ఫోన్ లో మాట్లాడటం తోనే సరిపెడతారని విద్యార్థులు చెబుతున్నారు.సాయంత్రం స్టడీ అవర్ సమయంలో కొంతమంది తాగి స్కూల్ కాంపౌండ్ లోకి వచ్చి వేధిస్తున్నారని వాపోయారు.మరి కొందరు ఆకతాయిలు ఆటలాడుతూ తమను చదువుకోకుండా డిస్ట్రబ్ చేస్తున్నారని అంటున్నారు. విషయాలను హెడ్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్దామనుకుంటే ఆయన సరిగా రాక పట్టించుకోవడంలేదని వాపోయారు. వీడీసీ కి ఫిర్యాదు చేస్తామంటే హాల్ టికెట్ ఇవ్వమంటూ ఉపాధ్యాయులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హెడ్ మాస్టర్ పట్టించుకోక తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కాక తరగతులు బహిష్కరించి క్లాస్ రూమ్ బయట నిరసన వ్యక్తం చేస్తున్నట్టు వివరించారు.ఖచ్చితంగా హెడ్ మాస్టర్ ప్రతీ రోజు సమయానికి వచ్చి అందుబాటులో ఉండాలని పరీక్షల సమయంలో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. హెడ్ మాస్టర్ వాహనాన్ని అడ్డగించారు. ఈ విషయాన్నిమహా ప్రతినిధి మండల విద్యాధికారి మహమూద్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన పాఠశాలకు వచ్చి విద్యార్థులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసన విరమించారు.అటు విద్యార్థుల సమస్యలను పట్టించుకోని హెడ్ మాస్టర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాలను సందర్శించిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా టీజీవీపీ అధ్యక్షుడు కొట్టురి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హెడ్మాస్టర్ ను సస్పెండ్ చేయడంతో పాటు వీడీసీ చైర్మన్ కు తెలియజేస్తామంటే హాల్ టికెట్లు ఇవ్వనంటూ బెదిరింపులకు పాల్పడిని ఉపాధ్యాయులపై కూడా తక్షణమే విద్యా శాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాంచంద్రాపూర్ బిన్నీ రైస్ మిల్ సీజ్



**ములుగు, మహా :** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రాంచంద్రాపూర్లోని ఉమా బిన్నిరైస్ మిల్ ను సివిల్ సప్లై అధికారులు సీజ్ చేశారు. మిల్లులో జరిగిన అక్రమాలపై తనిఖీలు చేపట్టిన సివిల్ సప్లై అధికారులు పెద్దమొత్తంలో ఫ్రాడ్ జరిగినట్లు తేల్చారు. శుక్రవారం ఉమా బిన్ని రైస్ మిల్లును డిప్యూటీ తహసీల్దార్లు (సివిల్ సప్లై) నితీష్, రాంచందర్, ఎంఆర్ఐ రమేష్‌లతో కలిసి తనిఖీ చేసినట్లు డీఎం రాంపతి తెలిపారు. ఈ నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను రబీ కాలంలో సుమారు 604.628 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదనే విషయాన్ని ధృవీకరించారు. జిల్లా రైస్ మిల్లర్ యూనియన్ ప్రతినిధులతో కలిసి ఉమా బిన్ని రైష్ మిల్లును తనిఖీ చేయగా రూ.2,16,98,407ల విలువ గల ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు గుర్తించామని రాంపతి తెలిపారు. పంచుల సమక్షంలో సీజ్ చేసిన అధికారులు మిల్లు యజమాని భూక్య ఉమాదేవిపై క్రిమినల్ ఏకసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే సివిల్ సప్లై అధికారులు రెండు రోజుల క్రితమే మిల్లుపై దాడి చేసి తనిఖీలు చేపట్టారని స్థానికులు చెబుతుండగా శుక్రవారం ప్రెస్ నోట్ రిలీజ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రైస్మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి వెంటనే సీజ్ చేసిన ఆఫీసర్లు మూడు రోజుల తరువాత ప్రకటన విడుదల చేయడం వెనుక ఆంతర్యం ఏమిటోనని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు



**వరంగల్, మహా ;** గ్రేటర్ వరంగల్ నగరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నీటి సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వేసవిలో బల్దియా పరిధిలోని 66 డివిజన్లో మంచినీరు సరఫరాకు రూపొందించిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్షించి పక్కా గా నిర్వహించుటకు మేయర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి కాలంలో బల్దియా పరిధిలోని దాదాపు పది లక్షల జనాభాకు ధర్మసాగర్ సమ్మర్ స్టోరీ ట్యాంక్ నుండి ఫిల్టర్ బెడ్ ల ద్వారా మంచినీరు అందించనున్న నేపథ్యంలో ఇటీవల తాను ధర్మసాగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను సందర్శించానని, వచ్చే మూడు మాసాలకు వరకు నగర ప్రజలకు సరిపడ నీరు అందుబాటులో ఉన్నాయని, ఇంజనీరింగ్ అధికారులు వాటర్ లెవెల్స్ ను నిత్యం పర్యవేక్షిస్తుండాలని అన్నారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారులకు లేఖ రాయాలన్నారు. ఈ సందర్భంగా 66 డివిజన్లలో మంచినీటి సరఫరా సక్రమ నిర్వహణకు రూపొందించిన అన్యువల్ మెయింటెనెన్స్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలను డివిజన్ల వారీగా మేయర్, కమిషనర్ లు సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేస్తూ వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మహా నగరం లోని దేశాయిపేట, కాకతీయ యూనివర్సిటీ, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ల లో ఉన్న మరమ్మత్తులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని, అవసరమైన రసాయనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ నుండి 66 డివిజన్లో ఎద్దడి లేకుండా కచ్చితంగా మంచినీరు అందాలని ముఖ్యంగా స్లం ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నీటి సరఫరా జరగాలని, ఉన్న బోర్లను ఫ్లషింగ్ చేయడంతో పాటు నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ వ్యాప్తంగా గత వేసవిలో మాదిరిగా ముఖ్యమైన కూడళ్ళు, జనావాస ప్రదేశాల్లో తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ చలివేంద్రాల నిర్వహ కు వ్యక్తిని నియమించాలన్నారు. ఈ సమీక్షలో బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఈ ఈలు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, డి ఇ లు, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా అఖిల్ మహజన్ నియామకం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌ల బదిలీల లో భాగంగా ఆదిలాబాద్ ఎస్పీగా కొనసాగుతున్న గౌస్ ఆలంను కరీంనగర్ సీపీగా ట్రాన్స్ఫర్ చేశారు.ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న అఖిల్ మహజన్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. జమ్ముకాశ్మీర్‌కు చెందిన ఈ ఐపీఎస్ అధికారి హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేసి కొంత కాలం సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేసారు.అది సంతృప్తినివ్వక ఇంటికి తిరిగొచ్చి కొన్నినెలల పాటు తండ్రికి వ్యాపారంలో సాయంగా ఉన్నారు. అప్పుడే యూపీఎస్సీ ఎక్జామ్స్ రాయాలని నిశ్చయించుకున్నారు. 2013లో సివిల్స్‌కు ప్రిపేర్ అయి 2016 లో విజయం సాధించారు. సిద్ధిపేటలో శిక్షణ తీసుకున్న ఈయన 2017 ఐపీఎస్ బ్యాచ్ అధికారిగా తెలంగాణలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తొలుత మంచిర్యాల ఏసీపీగా , రామగుండం డీసీపీ గా (అడ్మినిస్ట్రేటివ్),మంచిర్యాల డీసీపీగా కొంత కాలం పెద్దపల్లి డీసీపీగా పని చేసారు.అనంతరం 2023లో రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీపై రానున్నారు.

# సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు కలెక్టర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ... మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలని అన్నారు. విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమి పైన మాత్రమే ప్రాణం ఉన్న జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందని తెలిపారు. ఆడ, మగా కలిసి ప్రయాణిస్తేనే అర్థం, పరమార్థం, స్త్రీ పురుషులిద్దరు ఒక బండికి రెండు చక్రాలాగా ప్రయాణం చేసినప్పుడే సమాజంలో ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. కుటుంబానికి మూలం కుటుంబంలో ఉన్న మహిళా అని, కుటుంబంలోని ప్రతి విషయంలో మహిళ సమతుల్యత కలిగి ఉంటుందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూడటం జరుగుచున్నదని, ఇప్పుడిప్పుడే మహిళలకు చదువుపరంగా, ఆర్థికపరమైన విషయాలలో సమానంగా అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. అబ్బాయిలను అమ్మయిలను సమానంగా పెంచాలని, పిల్లలకు విలువలతో కూడిన విషయాలు నేర్పించాలని అన్నారు. కుటుంబం, కుటుంబంలోని బంధాలు, విలువలు మర్చిపోకుండా ఉన్నప్పుడే సమాజాన్ని కాపాడుకోగలమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే ప్రతిఫలాలను మహిళలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వరంగంలో ఉన్న మనందరం కృషి చేయాలన్నారు. జిల్లాలో 1/3 వంతు మహిళా అధికారులు పని చేస్తున్నారని, అందరూ బాగా పని చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా అధికారుల సహకారం ఎంతైన ఉందని తెలిపారు. మహిళలు ఏదైన సాధించగలరాని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

# డీజే లు నిర్వహిస్తే కఠిన చర్యలు



**వరంగల్, మహా ;** వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు పట్టణంలో డీజేలు నిర్వహించడాన్ని నిషేధించడం జరిగింది. ఈ సందర్భంగా మటెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు విజ్ఞప్తి ఇట్టి విషయాన్ని గమనించగలని సీపీ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మట్టేవాడ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. తేదీ 632025 రోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో బొమ్మల గుడి సమీపంలోని వేణురావు కాలనీలో ఎంబాడి రాహుల్ తండ్రి పేరు బోజరాజు మనుగొండ గ్రామస్తుడు డబుల్ డీజే నడుపుతూ అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించారని ఆ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేయడం జరిగింది. డీజే నిర్వాహకుడు ఎంబడి రాహుల్ పైన మటెవాడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి డీజే ను సీజ్ చేయడం జరిగిందని సబ్ ఇన్స్పెక్టర్ విఠల్ తెలిపారు. అలాగే ఇకనుంచి ఎవరైనా అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించి డీజేని నడిపి ప్రజల శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా ఐపీఎస్ వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని పదవ తరగతి పరీక్షలు జరుగబోయే నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని ఇన్స్పెక్టర్ గోపి సూచించారు.

## కోటగుళ్లను సందర్శించిన బిట్స్ విద్యార్థులు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా :** భూపాలపల్లి పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ లోని నర్సరీ , ఎల్.కె.జి విద్యార్థులు విద్యా వైజ్ఞానిక విహార యాత్రలో భాగంగా ప్రాచీన దేవాలయమైన కోటగుళ్ళు దేవాలయంను సందర్శించారు. స్థానిక ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఈ విహార యాత్రలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని దానిలో భాగంగానే చిన్నారులను అతి ప్రాచీనమైనటువంటి ఈ ప్రదేశానికి తీసుకువచ్చామని, తద్వారా విద్యార్థులకు చరిత్రతో పాటు అనేక విషయాలు తెలుసుకుంటారని, ఈ సంపదను పర్యవేక్షించడంలో విద్యార్థులు తమవంతు పాత్రను పోషిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్య, ఆట,పాటలతో పాటు వైజ్ఞానిక యాత్రలు కూడా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని, అందుకే విద్యార్థులను విభాగాల వారిగా ఈ యాత్రలకు తీసుకు వెళ్తున్నామని తెలియజేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కూడా సందర్శించారు.




# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సకాలంలో పూర్తి చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలాని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తి చేయుటపై, తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టవలసిన చర్యలపై ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల గ్రౌండింగ్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పూర్తి చేయుటపై మొదటి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతం చేయాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ (Layout Regulation Scheme)ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి ఎల్ ఆర్ ఎస్ సద్వినియోగం చేసుకునేలా చేయాలని అన్నారు. తాగునీటి పై సమీక్ష నిర్వహిస్తూ వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో చేపట్టవలసిన మరమ్మత్తులు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రణాళికా ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి నీటి ఎద్దడి రాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా పనులను మార్చి 15వ తేదీ వరకు గ్రౌండింగ్ చేపట్టి 20వ తేదీ వరకు పనులు పెండింగులో లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకై చేసుకున్న దరఖాస్తులలో అర్హత ఉన్న దరఖాస్తుల గ్రౌండింగ్ చేయుటలో వేగం పెంచి పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో అర్హులైన దరఖాస్తులకు మంజూరీ ఇచ్చే విధంగా పని చేయాలన్నారు. త్వరితగతిన గ్రౌండింగ్ పనులు పూర్తి చేసి జిల్లాలో పెండింగ్ లేకుండా మీరంత పని చేయాలని కలెక్టర్ అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, మండలాల నుండి ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా భోరజ్ చెక్ పోస్ట్ వద్ద 290 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో డిఎస్పి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టగా యూపీ 25 ఈటీ 3632 లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు.హైదారాబాద్ నుండి మధ్యప్రదేశ్ లోని బాలగట్ కు బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని, ఇట్టి బియ్యం విలువ సుమారు 15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అక్రమంగా బియ్యం,ఇసుక రవాణా చేసే వారిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు డిఎస్పి జీవన్ రెడ్డి తెలిపారు. లారీ డ్రైవర్ తహిర్ , లారీ ఓనర్ ఎండి.నజీమ్ ,బియ్యం సరఫరా చేస్తున్న నాగనాథ్, షఫీ లపై కేసు నమోదు చేసామన్నారు. బియ్యం పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అభినందించారు. డిఎస్పి తో పాటు జైనథ్ సిఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం సిబ్బంది తదితరులున్నారు.

# పంటలు ఎండిపోతున్న అధికారుల స్పందన కరువు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా :** వారం రోజులుగా లోవోల్టేజ్ సమస్యతో సతమతం అవుతున్న మేడిపల్లి గ్రామ రైతులు. యాచారం మండలం, మేడిపల్లి నక్కెర్త గ్రామంలో వారం రోజులుగా విద్యుత్తు లో వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి అల్లంపల్లి నరసింహ మాట్లాడుతూ... ఆరుగాలం కష్టపడి వేసిన పంటలకు విద్యుత్ సమస్యతో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాలు బీటలు వాడుతున్నాయని రైతులు వాపోతున్నారని తెలిపారు. వారం రోజులుగా సంబంధిత విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న సమస్య పరిష్కారానికి సహకరించడం లేదని రైతులు మండిపడ్డాతున్నారు. అయినా స్థానిక విద్యుత్ ఉద్యోగులు స్పందించకపోవడంతో కూరగాయల పంటలు పూర్తిగా ఎండిపోతున్న వైనం చోటుచేసుకుంది. పశువులకు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న, అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని అన్నారు. తక్షణమే విద్యుత్ పై అధికారుల జోక్యం చేసుకొని పంటలకు, మూగజీవాలకు నీటిని అందించే దిశగా, సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ట్రేడ్ వార్‌తో రెండ్రోజుల లాభాలకు బ్రేక్..

## ఫ్లాట్‌గా ముగిసిన ఈక్విటీ మార్కెట్‌లు..!

వివిధ దేశాలపై అమెరికా టారిఫ్‌లతో అంతర్జాతీయంగా భారీ స్థాయిలో అనిశ్చితి కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో శుక్రవారం ప్రారంభ లాభాలు ఆవిరయ్యాయి. ఈక్విటీ మార్కెట్లలో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. బీఎస్ఈ30 ఇండెక్స్ సెన్సెక్స్ 7.51 పాయింట్ల పతనంతో 74,332.58 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో మిడ్ సెషన్‌లో 246.34 పాయింట్లు లాభ పడి 74,586.43 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లింది. మరోవైపు, ఎన్ఎస్ఈ50 సూచీ నిఫ్టీ 7.80 పాయింట్లు వృద్ధి చెంది 22,552.50 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో నిఫ్టీ 89 పాయింట్ల వృద్ధితో 22,633.80 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. బీఎస్ఈ30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో జొమాటో, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్, పవర్ గ్రిడ్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), టెక్ మహీంద్రా, ఐటీసీ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఏషియన్ మార్కెట్‌లలో టోక్యో, షాంఘై, హాంకాంగ్, సియోల్ మార్కెట్లు, యూరోపియన్ మార్కెట్‌లు నష్టాలతో స్థిర పడ్డాయి. వాల్ స్ట్రీట్ గురువారం నష్టాలతో ముగిసింది. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 2,377.32 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మరోవైపు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,617.80 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.32 శాతం వృద్ధి చెంది 70.38 డాలర్లు పలికింది.






# ముంబైలో టెస్లా తొలి షోరూమ్

## నెల అద్దె ఎంతో తెలుసా..?

లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. తన తొలి షోరూమ్‌ను దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు బుధవారం వెల్లడించాయి. సీఆర్ఈ మ్యాట్రిక్స్ వివరాల ప్రకారం.. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారు. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసింది. ఎలన్ మస్క్ సారధ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మోదీతో భేటీ అయిన రోజుల వ్యవధిలోనే టెస్లా ఈ చర్యలు చేపట్టడం విశేషం. ఇక భారత్‌లో తొలి రెండు షోరూమ్‌లను ఏర్పాటుకు దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాలను సంస్థ ఎంపిక చేసింది. ఇటీవలే నియామకాల ప్రక్రియ కూడా చేపట్టింది (Tesla Begins Hiring In India). కస్టమర్ రిలేటెడ్, బ్యాక్‌ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ ప్రకటన ఇటీవలే చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతున్నట్లు తెలిపింది. మిగిలిన పోస్టులకు ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

# ఎన్ఎండీసీ సీఎండీగా అమితవ ముఖర్జీ




**హైదరాబాద్ :** ఖనిజ దిగ్గజం ఎన్ఎండీసీ నూతన సీఎండీ గా అమితవ ముఖర్జీ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కంపెనీ సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయననే పూర్తి స్థాయి సీఎండీగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన గురువారం పదవిబాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ పదవిలో ఫిబ్రవరి 29, 2028 వరకు కొనసాగనున్నారు. నవంబర్ 2018 నుంచి ఎన్ఎండీసీ డైరెక్టర్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖర్జీకి మార్చి 2023లో సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది కేంద్రం.

# ఔషధానికి ట్రంప్ సుస్తీ

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి కాలుదువ్వుతుండటం.. ఇప్పుడు భారత్‌సహా అన్ని దేశాల్లో గుబులు పుట్టిస్తున్నది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డ భారతీయ ఔషధ పరిశ్రమకు పెద్ద దెబ్బేనన్న అభిప్రాయాలు రోజురోజుకూ పెరుగుతుండటం గమనార్హం. సుంకాలు పెంచితే లక్ష కోట్ల రూపాయలపైనే దేశీయ ఫార్మా ఇండస్ట్రీ ప్రభావితం కావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయిప్పుడు. తొలి దశలో 25 శాతం చొప్పున భారతీయ ఫార్మా దిగుమతులపై ట్రంప్ సర్కారు సుంకాలు వేయవచ్చని తెలుస్తున్నది. క్రమేణా దీన్ని పెంచుతూపోయే వీలున్నట్టు సమాచారం. మేకిన్ అమెరికా.. అమెరికాలో మళ్లీ తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి, అక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడానికి దేశంలోకి వస్తున్న విదేశీ వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచడమే మార్గమని ట్రంప్ భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆటో, సెమీకండక్టర్స్‌తోపాటు ఫార్మా దిగుమతులపైనా హై టారిఫ్‌లను పరిశీలిస్తున్నట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. అమెరికాలో తయారు చేయండి.. లేకపోతే అధిక టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇప్పటికే ఆయా కంపెనీలకు ట్రంప్ సర్కారు తేల్చిచెప్పినట్టు కూడా తెలియవస్తున్నది. ఇక ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తులపై అమెరికా ఎలాంటి సుంకాలు వేయడం లేదు. కానీ అమెరికా నుంచి దిగుమతి అవుతున్న ఔషధాలపై భారత్ 10 శాతం సుంకాలను వేస్తున్నది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి దారితీస్తున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాకు భారతీయ ఫార్మా దిగుమతులతో లాభమే ఎక్కువగా జరుగుతున్నది. అగ్రరాజ్య ఆరోగ్య సంరక్షణ రంగాన్ని 2022లో దాదాపు 408 బిలియన్ డాలర్ల మేర చౌక జనరిక్ ఔషధాలు ఆదుకున్నాయి. ఇవన్నీ భారత్, చైనా నుంచి వస్తున్నవే. దీంతో ఇప్పుడు వీటిపై సుంకాలు వేస్తే అమెరికా ప్రజలపైనే భారం మోపినట్టు అవుతుందన్న వాదనలూ తెరపైకి వస్తున్నాయి. దీంతో ఇప్పటికైతే ఫార్మా ఇండస్ట్రీకి సుంకాల నుంచి మినహాయింపు దక్కే అవకాశాలూ లేకపోలేదని అంటున్నారు. ప్రధానంగా భారతీయ ఔషధ కంపెనీలు తక్కువ లాభాలకే అమెరికా మార్కెట్‌లో తమ మందులను విక్రయిస్తున్నాయని మార్కెట్ నిపుణులూ గుర్తుచేస్తున్నారు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# యెమెన్, జిబౌటీ తీరంలో ఘోరం

## నాలుగు బోట్లు మునిగి 188 మంది గల్లంతు



యెమెన్, జిబౌటీ తీరాల మధ్య సముద్రంలో ఘోరం జరిగింది. బతుకుదెరువు కోసం దేశ విడిచి వెళ్తున్న 188 మంది బతుకులు నడిసంద్రంలో కలిసిపోయాయి. గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వెళ్తున్న కూలీలను తీసుకెళ్తున్న నాలుగు పడవలు మార్గమధ్యలో మునిగిపోయాయి. దాంతో ఆ పడవల్లో ప్రయాణిస్తున్న 188 మంది గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ మీడియాకు తెలిపింది. తమ దేశంలో ఘర్షణల నుంచి బయటపడేందుకు ఇథియోపియా ప్రజలు ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుంటారు. అందుకు ఈ ప్రమాదం జరిగిన మార్గాన్నే ఉపయోగిస్తుంటారు. అది ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వలస మార్గం. ఈ మార్గంలో గత జనవరిలో కూడా ఇదే తరహా ప్రమాదం జరిగింది. యెమెన్ తీరంలో పడవ మునిగి 20 మంది ఇథియోపియన్స్ ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా 2024 ఏడాదిలో మొత్తం 558 మంది ఈ మార్గంలో మరణించారు. సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి జాడ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

# పేలిన స్టార్‌షిప్ వ్యోమనౌక..

## బహమాస్‌లో పడిన శకలాలు



న్యూయార్క్: బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ సంస్థ .. 8వ సారి స్టార్‌షిప్(SpaceX Starship) మెగారాకెట్ వ్యవస్థను పరీక్షించింది. గురువారం రాత్రి జరిగిన ఆ పరీక్షలో.. స్టార్‌షిప్ రాకెట్ పేలిపోయింది. కానీ స్పేస్ఎక్స్ సంస్థ స్వల్ప లక్ష్యాలను సాధించింది. రాకెట్‌కు చెందిన బూస్టర్‌ను విజయవంతంగా లాంచ్ టవర్‌కు తీసుకురాగలిగింది. స్టార్‌షిప్ వ్యోమనౌక పేలిన దృశ్యాలు వీడియోలకు చిక్కాయి. కొందరు సముద్రం నుంచి, కొందరు విమానాల నుంచి ఆ వీడియోలు తీశాయి. ఆ వ్యోమనౌక శకలాలు బహమాస్‌లో పడినట్లు గుర్తించారు. అయితే స్టార్‌షిప్ పేలిన సమయంలో.. ఫ్లోరిడా నుంచి విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమానాలను నిలిపివేశారు. దక్షిణ టెక్సాస్‌లోని స్పేస్ఎక్స్ స్టార్‌బేస్ నుంచి స్టార్‌షిప్‌ను ప్రయోగించారు. 232 అడుగుల ఎత్తైన సూపర్ హెవీ రాకెట్ బూస్టర్‌ను ఈ ప్రయోగంలో పరీక్షించారు. స్టార్‌షిప్ ఎగిరిన 20 సెకన్లకే ..స్పేస్ఎక్స్‌తో సంబంధాలు తెగిపోయాయి. లైవ్‌స్ట్రీమ్ జరుగుతున్న సమయంలోనే అనేక ఇంజిన్లు తెగిపోయాయి. ఇంజిన్లతో లింక్ తెగిపోవడం వల్ల.. ఆల్టిట్యూడ్ కంట్రోల్ తప్పుతుందని స్పేస్ఎక్స్ కమ్యూనికేషన్ మేనేజర్ డాన్ హూట్ తెలిపారు. ఫ్లోరిడా, కరీబియన్ దీవుల నుంచి కూడా స్టార్‌షిప్ పేలుడు దృశ్యాలు కనిపించాయి.



# ప్రధాని మోదీకి బార్బడోస్ ఉన్నత పురస్కారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం లభించింది. మోదీకి బార్బడోస్ దేశం ప్రతిష్ఠాత్మకమైన 'ఆనరరీ ఆర్డర్ ఆఫ్ ఫ్రీడం ఆఫ్ బార్బడోస్' పురస్కారాన్ని ప్రదానం చేసింది. కొవిడ్ మహమ్మారి సమయంలో మోదీ సమర్థ నాయకత్వం, విలువైన సహాయాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసింది. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ తరఫున విదేశాంగ సహాయ మంత్రి పబిత్రా మార్గెటిటా ఈ అవార్డును అందుకున్నారు. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును గతేడాది నవంబర్ 20న గయానాలోని జార్జ్‌టౌన్‌లో జరిగిన 2వ ఇండియా CARICOM లీడర్స్ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో బార్బడోస్ ప్రధాని మియా అమోర్ మోట్లీ ప్రకటించినట్లు పేర్కొంది.

# రెండు రోజుల్లో పదవి నుంచి దిగిపోనున్న ట్రూడో..


## మీడియా ముందు కన్నీటి పర్యంతం




కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మరో రెండు రోజుల్లో తన పదవి నుంచి దిగిపోనున్నారు. మార్చి 9వ తేదీన ఆయన స్థానంలో లిబరల్ పార్టీ కొత్త నేతను ఎన్నుకోబోతోంది. ఈ నేపథ్యంలో ప్రధానిగా చివరి సారి కెనడా ప్రజలను ఉద్దేశించి ట్రూడో గురువారం మాట్లాడారు. విలేకరుల సమావేశంలో భావోద్వేగానికిలోనై కన్నీరు పెట్టుకున్నారు. తన పదేళ్ల పాలనలో ఎదురైన సవాళ్లను తల్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కెనడా ప్రధానిగా నిరంతరం దేశ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేసినట్లు చెప్పారు. 'కెనడా ప్రజల ప్రయోజనాలే తొలి ప్రాధాన్యంగా పనిచేశా. ప్రజల మద్దతుతో చివరి వరకూ మెరుగైన పాలన అందించా. ప్రజల మద్దతు నాకు ఉంది. నా చివరి రోజుల్లో కూడా వారిని వదిలేయలేదు. ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నా. భవిష్యత్తులోనూ ప్రజల కోసం నిలబడతాను' అంటూ ట్రూడో మీడియా ముందు భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇక కెనడా, మెక్సికోకు అదనపు టారిఫ్‌ల నుంచి నెల రోజులపాటు ట్రంప్ ఇచ్చిన ఉపశమనం గురించి ట్రూడో నిరాశతో స్పందించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభాలు, ట్రంప్ ప్రభుత్వాన్ని కష్టకాలంగా అభివర్ణించారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లకు ప్రతిగా కెనడా కూడా ఆంక్షలు, ఇతర వ్యూహాలను అమలు చేస్తుందని తెలిపారు. కెనడా ప్రధానమంత్రి పదవికి, అధికార లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా అధినేత పదవికి రాజీనామా చేస్తున్నట్టు జస్టిన్ ట్రూడో జనవరి 6న ప్రకటించిన విషయం తెలిసిందే. ఒట్టావాలోని తన నివాసం వద్ద ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తాను రాజీనామా చేస్తానని తన పార్టీకి, గవర్నర్‌కు తెలియజేసినట్టు తెలిపారు. కొత్త ప్రధాని ఎన్నిక వరకు తాను ఈ పదవుల్లో కొనసాగుతానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల వరకు పార్టీని, కెనడాకు నాయకత్వం వహించే కొత్త నేత ఎన్నిక ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా జనవరి 27న ప్రారంభం కావాల్సిన పార్లమెంటును మార్చి 24 వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తన నాయకత్వంపై లిబరల్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అసంతృప్తి పెరిగిపోతుండటంతో అర్ధాంతరంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# దుస్తులు తీసేసి విమానంలో పరుగులు తీసిన మహిళా ప్రయాణికురాలు

విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రముఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృత చేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ మహిళా ప్రయాణికురాలు ఫ్లైట్‌లో గందరగోళం సృష్టించింది. తన చేష్టలతో తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసింది. సోమవారం మధ్యాహ్నం సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ అమెరికాలోని హూస్టన్ నుంచి ఫీనిక్స్ బయల్దేరింది. విమానం హూస్టన్‌లోని విలియం పి హాబీ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అవుతుండగా.. ఓ మహిళ ఉన్నట్టుండి గట్టిగా కేకలు వేసింది. తన దుస్తులు వదిలేసి ఫ్లైట్‌లో పరుగులు తీస్తూ గందరగోళం సృష్టించింది. కాక్‌పిట్ తలుపును కొడుతూ.. తనను విమానం నుంచి కిందకు దించేయండి అంటూ బిగ్గరగా అరిచింది. దాదాపు 25 నిమిషాల పాటూ ఇలానే ప్రవర్తించింది. ఆమె వింత ప్రవర్తనకు ఫ్లైట్‌లోని ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఆమె ప్రవర్తనతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించాల్సి వచ్చింది. ఫ్లైట్ ల్యాండ్ అవ్వగానే సదరు మహిళను హూస్టన్ పోలీసులకు అప్పగించారు. ఆమెను మానసిక వైద్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతానికి ఆమెపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో విమానం 90 నిమిషాలు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరినట్లు సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఓ ప్రకటనలో తెలిపింది.






## ముందు అట్లీ.. తర్వాతే త్రివిక్రమ్ సినిమా?

'పుష్ప2' హడావిడి ముగిసిన నాటినుంచి అల్లు అర్జున్ నెక్ట్స్ పనిచేసేది ఏ దర్శకునితో? అనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో నడుస్తూనే ఉంది. ఈ చర్చల్లో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు త్రివిక్రమ్, అట్లీ. నిజానిక్కూడా వీరిద్దరి కథలకూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు బన్నీ. మరి ముందు ఎవరితో? అనేదే ఇక్కడ చర్చ. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముందు అట్లీ సినిమానే ఉంటుందని తెలుస్తున్నది. నిజానికి 'జవాన్' పూర్తయిన నాటినుంచి బన్నీ కథపైనే ఉన్నారట అట్లీ. ఆ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే కంప్లీట్ అయ్యిందని, బౌండ్ స్క్రిప్ట్ రెడీగా ఉందని సమాచారం. అందుకే త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ని మొదలుపెట్టనున్నారట బన్నీ. అలాగే దర్శకుడు అట్లీకి ఆయన ఓ షరతు కూడా విధించారట. వచ్చే ఏడాది మార్చి కల్లా షూటింగ్ కంప్లీట్ అవ్వాలి అనేదే ఆ షరతు. పానిండియా సినిమా అంటూ సంవత్సరాల పాడుగునా తీస్తే కుదరని కరాఖండీగా చెప్పేశారట బన్నీ. స్క్రిప్ట్ ఇప్పటికే కంప్లీట్ అవ్వడంతో బన్నీ షరతుకు అట్లీ కూడా ఓకే చెప్పేశారట. ఈ లోపు త్రివిక్రమ్ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తిచేసుకొని, 2026 మార్చి తర్వాత సెట్స్‌కి వెళ్తుందని ఫిల్మ్ వర్గాల టాక్. ఈ సినిమాకు బన్నీ ఏడాదిన్నర డేట్లు ఇచ్చినట్టు తెలుస్తున్నది. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న పాన్ వరల్డ్ సినిమా కావడం వల్లే.. బన్నీ ఎక్కువ డేట్లు కేటాయించారన్నది ఇన్‌సైడ్ టాక్. అయితే.. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు మాత్రం ఇప్పటివరకూ రాలేదు. ఇందులో నిజానిజాలు ఎంతవరకో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## ఇంకా ఎన్నిసార్లు దేశాన్ని కాపాడతావు?

### అక్షయ్‌ని ట్రోల్ చేసిన ట్వింకిల్ ఖన్నా



బాలీవుడ్ స్టార్ కపుల్‌స్‌లలో అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా ఒకరు. 90స్‌లో జరిగిన ఫిల్మ్‌ఫేర్ మ్యాగజైన్ ఫోటోషూట్‌లో వీరిద్దరికి పరిచయం కాగా.. తొలిచూపులోనే ప్రేమలో పడ్డాడు అక్షయ్. అయితే అప్పటికే అక్షయ్ స్టార్ హీరోగా కెరీర్‌లో నిలదొక్కుకుంటుండగా.. రాజేష్ ఖన్నా, డింపుల్ కపాడియా కుమార్తెగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టింది ట్వింకిల్ ఖన్నా. ఇక 1999లో అక్షయ్, ట్వింకిల్ కలిసి ఇంటర్నేషనల్ ఖిలాడీ అనే సినిమాలో నటించగా.. ఈ సినిమా వలన ఇద్దరు దగ్గరయ్యారు. ఆ తర్వాత వచ్చిన మేలా చిత్రంతో ప్రేమలో పడిన ఈ జంట 2001లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. 24 ఏండ్లుగా ఒకరినోకరు సపోర్ట్ చేసుకుంటూ ముందుకు వెళుతుంది ఈ జంట. అయితే తన సినిమాల ఎంపికకు సంబంధించి ట్వింకిల్ తనను ఎగతాళి చేస్తుందని తెలిపాడు అక్షయ్ కుమార్. అక్షయ్ గత కొన్ని ఏండ్లుగా దేశభక్తి నేపథ్యంలో వచ్చిన సినిమాలలో నటిస్తున్న విషయం తెలిసిందే. హాలిడే, బేబీ, ఎయిర్‌లిఫ్ట్, గోల్డ్, మిషన్ మంగళ్, రీసెంట్‌గా వచ్చిన స్కై ఫోర్స్ ఇలా దాదాపు అక్షయ్ తీసిన సినిమాలన్ని దేశభక్తి కథతోనే వచ్చాయి.

## రాబిన్‌హుడ్ తో ఆటపాట



'రొమాంటిక్' 'రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది కేతికా శర్మ. తెలుగులో ఈ భామ మంచి బ్రేక్‌కోసం ఎదురుచూస్తున్నది. తాజాగా ఈ సొగసరి నితిన్ 'రాబిన్‌హుడ్' చిత్రంలో ఓ ప్రత్యేక గీతంలో నర్తించనుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతాన్ని ఈ నెల 10న రిలీజ్ చేయబోతున్నారు. ఈ పాటలో కేతికా శర్మ అల్ట్రా గ్లామరస్ అవతార్‌లో కనిపిస్తుందని, జీవీ ప్రకాష్ కుమార్ బాణీ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని, మ్యూజికల్‌గా ఈ సినిమా అందరిని అలరిస్తుందని చిత్రబృందం పేర్కొంది. శ్రీలీల, రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచనదర్శకత్వం: వెంకీ కుడుముల.

## రూ.200లకే సినిమా.. టికెట్ ధరలపై కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం



మూవీ లవర్‌స్‌కు కర్ణాటక ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 202526కు సంబంధించిన కర్ణాటక బడ్జెట్‌ను నేడు ప్రవేశపెట్టగా.. ఈ బడ్జెట్‌లో సినీ రంగానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంది. బడ్జెట్‌లో భాగంగా.. రాష్ట్రంలోని అన్ని మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్స్ థియేటర్‌లలో సినిమా టికెట్ ధరను రూ.200కి పరిమితం చేస్తున్నట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. సామాన్యులకు కూడా సినిమాను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇక ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం.. మల్టీప్లెక్స్‌లలో సాధారణ సీట్లకు టికెట్ ధర రూ.200 దాటకూడదు. అయితే గోల్డ్ క్లాస్ స్క్రీన్‌లు మరియు గోల్డ్ క్లాస్ సీట్లకు ఈ పరిమితి వర్తించదని కొన్ని రిపోర్టులు చెబుతున్నాయి. అంతేకాకుండా, కన్నడ సినిమాలను ప్రోత్సహించేందుకు మల్టీప్లెక్స్‌లలో కన్నడ, తులూ అలాగే ప్రాంతీయ చిత్రాలను ప్రైమ్ టైమ్‌లో ప్రదర్శించడం తప్పనిసరి చేసినట్లు తెలుస్తోంది. అదనంగా, కన్నడ సినిమాల ప్రచారం కోసం ఒక OTT ప్లాట్‌ఫాంని కూడా తక్కువ ధరలో ప్రభుత్వం తీసుకురాబోతున్నట్లు తెలుస్తుంది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS




## చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు మ్యాట్ హెన్రీ డౌటే..


### గాయంతో బాధపడుతున్న కివీస్ పేస్ బౌలర్

**దుబాయ్:** న్యూజిలాండ్ పేస్ బౌలర్ మ్యాట్ హెన్రీ.. ఆదివారం జరగనున్న చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఆడేది అనుమానంగా ఉంది. లాహోర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో అతను గాయపడ్డాడు. క్యాచ్ పట్టే తరుణంలో అతను కింద పడ్డాడు. ఆ సమయంలో అతని కుడి భుజానికి గాయమైంది. అయితే మ్యాట్ హెన్రీ త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నట్లు కివీస్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపారు. టోర్నీలో ఎక్కువ వికెట్లు తీసుకున్న బౌలర్‌గా హెన్రీ నిలిచాడు. అతను ఇప్పటి వరకు 10 వికెట్లు తీసుకున్నాడు. భారత్‌తో జరిగిన గ్రూపు మ్యాచ్‌లో అతను 5 వికెట్లు తీసుకున్న విషయం తెలిసిందే.

భుజంపై పడడంతో ప్రస్తుతం మ్యాట్ ఇబ్బందిపడుతున్నాడని, ఒకవేళ అతను బౌలింగ్ చేయగలిగితే తమకు పాజిటివ్‌గా ఉంటుందని కోచ్ స్టీడ్ తెలిపారు. మ్యాచ్ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని, ఈ మ్యాచ్‌లో ఆడేందుకు అతనికి అవకాశాలు కల్పిస్తామని, కానీ ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. న్యూజిలాండ్ ఈ టోర్నీలో ఒకే మ్యాచ్ ఓడింది. భారత్ చేతిలోనే ఆ మ్యాచ్‌లో పరాజయం చవిచూసింది. అయితే ఆ మ్యాచ్‌లో హెన్రీ అద్భుతంగా బౌల్ చేశాడు. ఒకవేళ గాయపడ్డ హెన్రీ బరిలోకి దిగితే, అప్పుడు మ్యాచ్ రసవత్తరంగా మారే ఛాన్సు ఉంది.



## వీరేంద్ర సెహ్వాగ్ సోదరుడు అరెస్ట్



టీమిండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సోదరుడు వినోద్ సెహ్వాగ్ అరెస్ట్ అయ్యాడు. చెక్ బౌన్స్ కేసులో చండీఘడ్ పోలీసులు వినోద్ సెహ్వాగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి అనేక మార్లు విచారణకు హాజరుకాకపోవడంతో 2023లో స్థానిక కోర్టు వినోద్ సెహ్వాగ్‌తో పాటు మరో ఇద్దరిని దోషులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే వినోద్ అరెస్ట్ జరిగింది. అరెస్ట్ అనంతరం వినోద్ తరపు న్యాయవాది సెషన్స్ కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను పోలీసులు వ్యతిరేకించారు. దీంతో దీనిపై విచారణ మార్చి 10కి వాయిదా పడింది. అప్పటివరకు వినోద్ సెహ్వాగ్ పోలీసుల కస్టడీలోనే ఉండనున్నాడు. అసలేం జరిగిందంటే.. క్సాల్టా ఫుడ్ అండ్ బేవరేజెస్ కంపెనీలో వినోద్ సెహ్వాగ్‌తో పాటు విష్ణు మిట్టల్, సుధీర్ మల్హోత్రా డైరెక్టర్లుగా ఉన్నారు. ఈ కంపెనీ 2018లో శ్రీ నైనా ప్లాస్టిక్స్ నుండి రూ. 7 కోట్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసింది. చెల్లింపుగా, కంపెనీ రూ. కోటి చొప్పున ఏడు వేర్వేరు చెక్కులను జారీ చేసింది. అయితే అకౌంట్‌లో సరిపడా నిధులు లేని కారణంగా అన్ని చెక్కులు బౌన్స్ అయ్యాయి. పలు ఫాలోఅప్‌ల అనంతరం శ్రీ నైనా ప్లాస్టిక్స్ అధినేత కృష్ణణ్ మోహన్ ఖన్నా కోర్టును ఆశ్రయించారు. స్థానిక కోర్టు క్సాల్టా ఫుడ్ అండ్ బేవరేజెస్ డైరెక్టర్లైన వినోద్ సెహ్వాగ్, విష్ణు మిట్టల్, సుధీర్ మల్హోత్రాను నిందితులుగా ప్రకటించింది. ఈ తీర్పుపై వినోద్ సెహ్వాగ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే, వీరేంద్ర సెహ్వాగ్‌కు సంబంధించి ఇటీవలికాలంలో వచ్చిన రెండో వార్త ఇది. వీరూ అతని భార్యతో విడాకులు తీసుకోనున్నాడని కొద్ది రోజుల కిందట సోషల్‌మీడియా కోడై కూసింది. ఇన్‌స్టాలో వీరూ, అతని సతీమణి ఇద్దరు అన్‌ఫాలో చేయడంతో ఈ ప్రచారం మొదలైంది. వీరూ గత కొద్ది రోజులుగా తన భార్యను విడిచి పెట్టి, తన ఇద్దరు పిల్లలతో పాటు వేరుగా ఉంటున్నట్లు తెలుస్తుంది. తరుచూ పుణ్యక్షేత్రాలు తిరిగే వీరూ ఈ మధ్యకాలంలో ఒంటరిగా ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. 46 ఏళ్ల వీరేంద్ర సెహ్వాగ్ 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అప్పటి నుంచి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా క్రికెట్‌తో సంబంధం కలిగి ఉంటున్నాడు. సెహ్వాగ్‌కు ఇద్దరు కొడుకులు. ఈ ఇద్దరూ క్రికెటర్లే కావడం విశేషం. సెహ్వాగ్ పెద్ద కొడుకు ఇటీవలికాలంలో జూనియర్ క్రికెట్‌లో సత్తా చాటి వార్తల్లో నిలిచాడు. సెహ్వాగ్‌కు టీమిండియా విధ్వంసకర బ్యాటర్‌గా పేరుండేది. సెహ్వాగ్ భారత్ తరపున టెస్ట్‌ల్లో తొలి ట్రిపుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. సెహ్వాగ్ తన కెరీర్‌లో రెండు ట్రిపుల్ సెంచరీలు చేశాడు. కేవలం బ్రాడ్‌మన్, గేల్, లారా మాత్రమే ఈ ఘనత సాధించారు.

## 21వ జాతీయ స్థాయి ఓపెన్ టెన్నిస్ పోటీలు షురూ..

### ప్రారంభించిన సీపీ సీవీ ఆనంద్

**బంజారాహిల్స్ :** హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ ఆధ్వర్యంలో 21వ జాతీయ స్థాయి ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ క్లబ్‌లో ప్రారంభం అయ్యాయి. నగర పోలీస్ కమిషనర్ సీవీ అనంద్ ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 425 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో టెన్నిస్ క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించేందుకు 21 ఏళ్ల క్రితం హైద్రాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రారంభించమన్నారు. ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు వచ్చి ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారు. ఇలాంటి టోర్నమెంట్స్ స్థానిక ఆటగాళ్లకు మంచి అనుభవం వస్తుందన్నారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతియేటా ఇలాంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. తాను అండర్ 19 జట్టుకు ఆడుతున్నపుడు ఉన్న స్నేహితులు కూడా ప్రస్తుతం టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు కె.సురేందర్ రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వర్ రావు, హోటా అధ్యక్షుడు నంద్యాల నరసింహా రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది పాతతరం టెన్నిస్ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు.

## తల్లి కాబోతున్న వినేశ్



**న్యూఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ తల్లి కాబోతున్నది. ఈ విషయాన్ని తన భర్త సోమ్‌వీర్ రాఠితో కలిసి గురువారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. 2018లో సోమ్‌వీర్‌ను పెండ్లి చేసుకున్న వినేశ్ తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో షేర్ చేసుకుంది. పారిస్(2024) ఒలింపిక్స్‌లో అనూహ్య రీతిలో కెరీర్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ 'కొత్త చాప్టర్‌తో మా ప్రేమాయణం కొనసాగుతోంది' అని రాసుకొచ్చింది. రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేశ్..కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com